


ఎలమంచిలిలో జలమయమైన స్టేషన్ రోడ్డు

రేషన్ కార్డులకు దరఖాస్తుల వెల్లువ

ఇంతవరకు 23,010 అప్లికేషన్లు అప్‌లోడ్

- సర్వర్ మొరాయిస్తుండడంతో దరఖాస్తుదారుల ఇక్కట్లు
- వాట్సాప్ 'మన మిత్ర'లో పౌరసరఫరాల సేవలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

కొత్త రేషన్ కార్డులతోపాటు ఇప్పటికే ఉన్న కార్డుల్లోకి కొత్తగా కుటుంబ సభ్యుల చేరిక, కార్డుల విభజన, చిరునామా మార్పు, తప్పుల సవరణ వంటి వాటి కోసం పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అందుతున్నాయి. అయితే పౌరసరఫరాల శాఖ వెబ్‌సైట్, సర్వర్ మొరాయిస్తుండడంతో దరఖాస్తు ప్రక్రియ మందకొడిగా సాగుతున్నది. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి రావడంతో వాట్సాప్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించింది.

కొత్త రేషన్ కార్డుల జారీ, ఇప్పటికే వున్న కార్డుల్లో తప్పుల సవరణ, చిరునామాల మార్పు, కుటుంబంలో కొత్తగా పెళ్లయిన వారి కోసం కార్డుల విభజన, చనిపోయిన వారి పేర్ల తొలగింపు, తదితర వాటి కోసం ఈ నెల ఏడో తేదీ నుంచి పౌరసరఫరాల శాఖ అధికారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన తరువాత సమీపంలోని సచివాలయానికి వెళ్లి ఓటీపీ ద్వారా ఈకేవైసీ చేయించుకోవాలి. అయితే పౌరసరఫరాల శాఖ సర్వర్ మొరాయిస్తుండడంతో దరఖాస్తులు అప్‌లోడ్, ఈకేవైసీ వంటివి బాగా ఆలస్యం అవుతున్నాయి. శివారు పంచాయతీల్లో ఇంటర్నెట్ కనెక్టివిటీ సరిగా లేకపోవడంతో సచివాలయాలకు పలుమార్లు వెళ్లాల్సి వస్తున్నది. ప్రభుత్వ డ్యాష్ బోర్డులోని వివరాల ప్రకారం జిల్లాలో ఇప్పటి వరకు 23,010 దరఖాస్తులు అందాయి. వివిధ కారణాల వల్ల 439 దరఖాస్తులను తిరస్కరించారు. అత్యధికంగా అనకాపల్లి మండలంలో 1,530, అత్యల్పంగా ఎలమంచిలి మండలంలో ... మిగతా 6వ పేజీలో


వాట్సాప్ 'మన మిత్ర'లో పౌరసరఫరాల శాఖ సేవలు

రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ



కొత్త రేషన్ కార్డుల జారీ అనేది నిరంతర ప్రక్రియ. దరఖాస్తుకు గడువు అంటూ లేదు. కొత్త రేషన్ కార్డులు, ఇప్పటికే వున్న కార్డుల్లో చేర్పులు, మార్పుల కోసం పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అందుతున్నాయి. కొన్నిచోట్ల సర్వర్లు మొరాయిస్తుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ సమస్యను అధిగమించడానికి ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరసరఫరాల సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఆండ్రాయిడ్ ఫోన్ వుంటే 'మన మిత్ర' ద్వారా సేవలను పొందవచ్చు.

కేవీఎల్ఎన్ మూర్తి,
జిల్లా సరఫరాల అధికారి

ఇసుక, గ్రావెల్ దందాను 48 గంటల్లో ఆపాల్సిందే

- లేకుంటే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతాం
- తహసీల్దారుకు జనసేన పార్టీ 'చోడవరం' ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు అల్టిమేటం


తహసీల్దార్ రామారావుతో మాట్లాడుతున్న జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు, నాయకులు

చోడవరం, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇసుక, గ్రావెల్ దందాలను 48 గంటల్లోగా ఆపియించాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు హెచ్చరించారు. మంగళవారం ఆయనతోపాటు పార్టీ నాయకులు ఇక్కడ రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ అంబటి రామారావుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో సాగుతున్న ఇసుక, గ్రావెల్ అక్రమ తవ్వకాలపై ఫొటోలు, వీడియోలను ఆయనకు అందించారు. అడ్డగోలుగా మైనింగ్ జరుగుతుంటే రెవెన్యూ సిబ్బంది స్పందించకపోవడం, తహసీల్దారు హోదాలో మీరు ఎటువంటి కట్టడి చర్యలు చేపట్టకపోవడం సరికాదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇసుక, గ్రావెల్ అక్రమ తవ్వకాల నిరోధానికి సంబంధిత శాఖల అధికారులతో కమిటీ వేయాలని ఆయన సూచించారు. అనంతరం కార్యాలయం నుంచి బయటకు వచ్చి మీడియాతో మాట్లాడారు. రెవెన్యూ అధికారుల అండతోనే ఇసుక, గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. శారదా నదిలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు జరుపుతుంటే జలవనరుల శాఖ అధికారులు... మిగతా 6వ పేజీలో

వర్షించిన మేఘం

జిల్లాపై అల్పపీడన ప్రభావం

- చోడవరం, ఎలమంచిలి, 'పేట ప్రాంతాల్లో భారీ వర్షం
- మిగిలినచోట్ల మోస్తరు వాన
- లోతట్టు ప్రాంతాలు జలమయం


కోటవురట్లలో కురుస్తున్న వర్షం

అనకాపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్): **ఒడిశాకు ఆనుకుని బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడం, దానిపై ఉపరితల ఆవర్తనం వుండడంతో జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు దఫదఫాలుగా వర్షం కురిసింది. చోడవరం, రావికమతం, ఎలమంచిలి, పాయకరావుపేట, కోటవురట్ల ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయం అయ్యాయి. పొలాల్లో నీరు చేరింది. నాతవరం మండలంలో కొండగెడ్డల నుంచి వస్తున్న వర్షం నీటితో పలు చెరువులు నిండిపోయి అలుగు పారుతున్నాయి. కాగా రానున్న రెండు, మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం వుందన్న వాతావరణ శాఖ బులెటిన్‌తో అధికారులు అప్రమత్తమయ్యారు.**


రావికమతంలో భారీ వర్షం.. పొలాల్లో చేరిన నీరు

అనకాపల్లి పట్టణంలో మంగళవారం మధ్యాహ్నం వర్షం కురిసింది. 29 మిల్లీమీటర్లు నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో, విజయరామరాజు పేట అండర్‌బ్రిడ్జి వద్ద నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఎలమంచిలిలో మంగళవారం సాయంత్రం గంటకుపైగా భారీ వర్షం కురిసింది. డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా వుండడంతో మురుగుతోపాటు వర్షం నీరు రహదారులను ముంచెత్తింది. క్లబ్ రోడ్డు, ఎంపీడీ కార్యాలయం రోడ్డు, కొత్తపేట ప్రధాన రహదారి, రాజీవ్ గాంధీ క్రీడామైదానం జలమయం అయ్యాయి. వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు. ఈదురు గాలులు వీచడంతో గంటన్నరపాటు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

పాయకరావుపేటలో మంగళవారం రాత్రి భారీ వర్షం పడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీక్షణంగా కాయగా, ఆ తరువాత వాతావరణం మారిపోయింది. రాత్రి 7.30 గంటల నుంచి ఎనిమిది గంటల వరకు భారీ వర్షం పడింది. మెయిన్‌రోడ్డుపై పలుచోట్ల నీరు నిలిచిపోయి చెరువులను తలపించడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

చోడవరం మండలంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కుండపోతగా వర్షం కురిసింది. బీఎన్ రోడ్డులో పలుచోట్ల భారీ గోతుల్లో నీరు చేరి పంట కుంటల్లా తయారయ్యాయి. వాహనదారులు నెమ్మదిగా ప్రయాణించాల్సి వచ్చింది. కోటవురట్ల మండలంలోని పలుగ్రామాల్లో మంగళవారం సాయంత్రం తరువాత సుమారు గంటన్నరపాటు భారీ వర్షం కురిసింది. గెడ్డలు, వాగుల్లో వరద నీరు ప్రవహించింది. చెరువుల్లోకి నీరు చేరుతున్నది. రావికమతం మండలంలో ఈదురు గాలు లు, ఉరుములతో కుండపోతగా వర్షం పడింది. గ్రామాల్లో డ్రైనేజీల నిర్వహణ అధ్వానంగా వుండడంతో వర్షం నీరు రోడ్లను ముంచెత్తింది. నర్సీపట్నం- భీముని పట్నం రోడ్డులో మేడివాడ వద్ద భారీ గోతుల్లో నీరు చేరి చెరువును తలపించింది. రావికమతంలో పిడుగు పడి కంఠంరెడ్డి నాయుడుకు చెందిన గేదె మృతిచెందింది. కొంతసేపు విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. మాడుగులలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రాత్రి తొమ్మిది తొమ్మిది గంటల వరకు జల్లులు పడుతూనే వున్నాయి.

పరిరక్షణ ప్రాంతంగా కొండకర్ల ఆవ


కొండకర్ల ఆవ (ఫైల్ ఫొటో)

- సర్వే చేసి సరిహద్దులు నిర్ణయించాలి
- ఆవ నీరు కలుషితం కాకుండా చర్యలు
- పర్యాటకాభివృద్ధికి ప్రణాళికను సిద్ధం చేయాలి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం, మునగపాక మండలాల సరిహద్దులో వున్న కొండకర్ల ఆవను వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్-1972 కింద కన్జర్వేషన్ రిజర్వ్‌గా (పరిరక్షణ ప్రాంతం) ప్రకటించాలని ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. దీనిపై మంగళవారం కలెక్టరేట్‌లో అటవీ, పంచాయతీ, ఇరిగేషన్, మత్స్య, పర్యాటక శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొండకర్ల ఆవను సర్వే చేసి సరిహద్దులు నిర్ణయించాలని ఆదేశించారు. ఆవ గట్లను పటిష్ఠం చేయాలని, మురుగు నీరు ఆవలో కలవకుండా, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు చెత్తాచెదారాన్ని ఆవలో వేయకుండా నియంత్రించాలన్నారు. రిసార్ట్స్ నిర్మాణం, రిక్రియేషన్, బోటింగ్, జెట్టీ నిర్మాణం వంటి పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలపై ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో డీపీఓ శిరీషారాణి, ఇన్‌చార్జి టూరిజం అధికారి డీసీకే మనోరమ, జిల్లా మత్స్య శాఖాధికారి ప్రసాద్, సామాజిక అటవీ విభాగం డీఎఫ్ఓ లక్ష్మణ్, సబ్ డీఎఫ్ఓ సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత దిశగా..

జిల్లాలో సత్ఫలితాలు ఇస్తున్న నవోదయం 2.0

- 151 గ్రామాల్లో నాటుసారా ప్రభావం
- ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజన
- విస్తృతంగా దాడులు, తనిఖీలు నిర్వహించిన ఎక్సైజ్ అధికారులు
- గ్రామాల్లో అవగాహన సదస్సులు
- పాత నేరస్థుల బైండోవర్
- 147 గ్రామాల్లో సారా తయారీ, విక్రయాలు బంద్
- మిగిలిన నాలుగు గ్రామాలపై ప్రత్యేక దృష్టి


తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న సారా కేసుల నిందితులు

నర్సీపట్నం, మే 27 (ఆంధ్రజ్యోతి): నాటుసారాను అరికట్టడానికి ప్రభుత్వం చేపట్టిన నవోదయం-2.0 సత్ఫలితాలు ఇస్తున్నది. ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది సారా తయారీ బట్టీలు వున్న ప్రాంతాలు, రవాణా మార్గాలు, విక్రస్తున్న గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. సారా కేసులకు సంబంధించి పాత నేరస్థులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ చేస్తున్నారు. జిల్లాలో గుర్తించిన 151 గ్రామాలను సారా రహితంగా చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికే 147 గ్రామాల్లో సారా తయారీ, రవాణా, విక్రయాలు, ఆపేస్తూ గ్రామ కమిటీలు తీర్మానాలు చేశాయి. తరువాత డిప్యూటీ కమిషనర్ స్థాయిలో విశాఖపట్నం ఎన్‌ఫోర్స్‌మెంట్, అసిస్టెంట్ కమిషనర్ స్థాయిలో అనకాపల్లి ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ పరిధిలో టాస్క్ ఫోర్స్ బృందాలు అయా గ్రామాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేసి తుది నివేదిక ఇస్తారు. దీని ఆధారంగా అనకాపల్లిని నాటుసారారహిత జిల్లాగా ప్రకటిస్తారు.

నాటు సారా నిర్మూలనకు ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 19న నవోదయం-2.0 కార్యక్రమాన్ని ప్రారంభించింది. నర్సీపట్నం, గొలుగొండ, వి.మాడుగుల, చోడవరం, పాయకరావుపేట, ఎలమంచిలి, సబ్బవరం, అనకాపల్లి ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలో 151 గ్రామాల్లో నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలు జరుగుతున్నట్టు గుర్తించారు. సారా తయారు చేస్తున్న గ్రామాలను ఏ కేటగిరీలో, సారా తయారీ, అమ్మకాలు చేస్తున్న గ్రామాలను బీ కేటగిరీలో, సారా విక్రయిస్తున్న గ్రామాలను సీ కేటగిరీలో పెట్టారు. ఏ కేటగిరీలో 21 గ్రామాలు, బీబి కేటగిరీలో 45 గ్రామాలు, సీ కేటగిరీలో 85 గ్రామాలు ఉన్నాయి. అయా గ్రామాల్లో సారా నిర్మూలనకు ప్రత్యేకంగా గ్రామ/ మండల కమిటీలను ఏర్పాటు చేశారు. గ్రామ కమిటీలో పంచాతీయ సర్పంచ్, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, ఎక్సైజ్ ఎస్ఐ ఉన్నారు. మండల కమిటీలో తహసీల్దార్, పోలీస్ శాఖ నుంచి ఎస్ఐ, ఎక్సైజ్ శాఖ నుంచి ఎస్‌హెచ్ఓ ఉన్నారు.

పాత నేరస్థులకు కౌన్సెలింగ్

సారా తయారీ, రవాణా, అమ్మకం చేస్తూ పట్టుబడిన వారు, గతంలో శిక్ష లేదా జరిమానా పడిన ... మిగతా 6వ పేజీలో


మహానాడు వేదికపై హోం మంత్రి అనితతో మాట్లాడుతున్న టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

మహానాడులో జిల్లా నేతల సందడి!

- ప్రధాన వేదికపై మంత్రి అనిత, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు, కార్పొరేషన్ల చైర్మన్లు

అనకాపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కడపలో నిర్వహిస్తున్న మహానాడు సభకు జిల్లా నుంచి నాయకులు, క్రియాశీల కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. హోం మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ఎస్ రాజు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పీలా గోవింద సత్యనారాయణ, మళ్ల సురేంద్ర, పీవీజీ కుమార్, ప్రగడ నాగేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ నారాయణరావు, తదితరులు తమ అనుచరులతో కలిసి హాజరయ్యారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన రిజిస్ట్రేషన్ కౌంటర్ల వద్ద జిల్లా నాయకులు ఫొటోలు దిగి సందడి చేశారు.

శారదా నది వ్యర్థాలమయం

- నీరు కలుషితం
- వ్యాధులు ప్రబలుతాయని ప్రజల భయాందోళన

అనకాపల్లి టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణానికి ఆనుకొని ఉన్న శారదా నది అధ్వానంగా తయారైంది. ఎక్కడబడితే అక్కడ వ్యర్థాలతో దారుణంగా ఉంది. ఈ నీరే పలు గ్రామాలకు సరఫరా అవుతుంటుంది. దీంతో వ్యాధులు ప్రబలుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పట్టణానికి చెందిన పలు హోటళ్ల నిర్వాహకులు, వ్యాపారులు వ్యర్థాలను రాత్రి వేళల్లో వంతెన పైనుంచి నదిలో పారబోస్తున్నా రు. ఈ వ్యర్థాలు ఎక్కడికక్కడ నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఈ నదిలో స్నానం చేస్తే చర్మవ్యాధులు వస్తాయని పలువురు భయపడుతున్నారు. శారదా నదిలో ఫిల్టర్ బావులు ఏర్పాటు చేసి వాటి ద్వారా పైపులైన్లతో సమీపంలోని పలు గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఈ నీరు కలుషితం కావడంతో వ్యాధులు వస్తాయని జనం భీతిల్లుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి నదిలో వ్యర్థాలు లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


శారదా నదిలో వ్యర్థాలు


వంతెన కింద పేరుకుపోయిన చెత్తా చెదారం

10న రాష్ట్రపతి విశాఖ రాక

- గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు



విశాఖపట్నం, మే 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వచ్చే నెల పదో తేదీన విశాఖపట్నం రానున్నారు. ఆర్కే బీచ్‌రోడ్డులో గల ఆంధ్ర విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్‌లో జరగనున్న గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. పదో తేదీ ఉదయం 9.50 గంటలకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 11.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. ఎయిర్‌పోర్టులో గౌరవ వందనం స్వీకరించిన తరువాత 11.40 గంటలకు రోడ్ మార్గాన బయలుదేరి ఏయూ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 12 గంటలకు గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవంలో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు కన్వెన్షన్ సెంటర్ నుంచి బయలుదేరి 1.10 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని 1.20 గంటలకు ప్రత్యేక విమానంలో జార్ఖండ్ వెళతారు.

ఎలమంచిలిలో కుండపోత

- పట్టణ రోడ్లు జలమయం
- 37.08 మీ.మీ వర్షపాతం నమోదు

ఎలమంచిలి, మే 27 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి పట్టణంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి పట్టణ రోడ్లు జలమయం కావడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. పట్టణంలో మంగళవారం 37.08 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. సుమారు గంటన్నర పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ప్రధాన రోడ్డుతోపాటు పలు జంక్షన్లు జలమయం కావడంతో పాలకులు, మునిసిపల్ అధికారుల తీరును ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. వర్షం పడినప్పుడల్లా పట్టణ రోడ్లు దారుణంగా జలమయం అవుతున్నా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. ప్రధాన రోడ్డుపై ఎల్ఐసీ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్ అవుట్‌గేట్ ఎదురుగా నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర అసహనానికి గురయ్యారు. అదేవిధంగా క్లబ్ రోడ్డు, ఎంపీడీవో కార్యాలయం రోడ్డు, కొత్తపేట ప్రధాన రోడ్డు, రాజీవ్ గాంధీ క్రీడామైదానాలు జలమయమయ్యాయి. కొన్నిచోట్ల డ్రైనేజీల మురుగు రోడ్లపై నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లింది. గంటపాటు కురిసిన వర్షానికి రోడ్లు జలమయం అవుతున్నా పాలకులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. ప్రజా సమస్యలపై కాస్తంత దృష్టి సారిస్తే శాశ్వత పరిష్కారం దొరుకుతుందని వారంటున్నారు. మునిసిపల్ సమావేశాల్లో కౌన్సిలర్లు ఈ సమస్యను ఎందుకు ప్రస్తావించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ప్రధానంగా డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో ఈ దుస్థితి నెలకొందన్నారు. పట్టణ రోడ్లు జలమయం కాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కోటవురట్లలో..

మండలంలో పలుగ్రామాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి గెడ్డలు, వాగులు పొంగి ప్రవహించాయి. చెరువులు నిండుకున్నాయి. సుమారు గంటన్నరపాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఈ వర్షానికి పొలాల్లో నీరు చేరింది. కోటవురట్లలో రహదార్లు జలమయమయ్యాయి. కే వెంకటాపురం, కొడవటిపూడి గ్రామాల గెడ్డ పొంగి ప్రవహించింది. ఎంపీడీవో కార్యాలయం వద్ద వర్షపు నీరు నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.


ఎలమంచిలిలో భారీగా కురుస్తున్న వర్షం

పాయకరావుపేటలో..

పాయకరావుపేటలో మంగళవారం రాత్రి భారీ వర్షం పడింది. సాయంత్రం చిన్న చినుకులతో ప్రారంభమైన వర్షం రాత్రి 7.30 గంటలకు కుండపోతగా కురిసింది.పట్టణంలో లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, మెయిన్‌రోడ్డుపై పలుచోట్ల వర్షపునీరు నిలిచిపోయి చెరువులను తలపించాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.


ఎలమంచిలి ప్రధాన రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు


కోటవురట్లలో కురుస్తున్న వర్షం


పాయకరావుపేటలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

మహానాడులో ఎలమంచిలి నేతల సందడి


మహానాడులో నియోజకవర్గ నేతలతో ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి, మే 27 (ఆంధ్రజ్యోతి): కడప మహానాడు జనసంద్రంగా మారిందని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ మహానాడుకు ఎలమంచిలి నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో టీడీపీ శ్రేణులు పాల్గొన్నారన్నారు. గతంలో కంటే భిన్నంగా మహానాడు నిర్వహిస్తున్నారన్నారు.

అచ్యుతాపురం రూరల్‌లో..

కడపలో మంగళవారం నుంచి ప్రారంభమైన మహానాడులో నియోజకవర్గ నాయకులు సందడి చేశారు. రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, మండల నాయకులు పీలా తులసీరామ్, రాజాన నానాజీ, రమణ, లాలం రాము, రమణబాబు, విజయ్, పతివాడ చిన్నయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.


మహానాడులో పాల్గొన్న మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, తదితరులు

చికిత్స పొందుతూ గాయపడిన వ్యక్తి మృతి


లోహిత్ కుమార్ (ఫైల్)

అచ్యుతాపురం రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిమడకకు చెందిన సత్తాడ లోహిత్ కుమార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు స్థానిక సీఐ నమ్మి గణేశ్ తెలిపారు. గత నెల 23న మైతాన్ కంపెనీ ప్రధాన ద్వారం ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈరిగల వివేక్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన లోహిత్ కుమార్ విశాఖలో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు ఆయన తెలిపారు. పూడిమడకకు చెందిన అప్పలరాజు, వెంకటిల రెండో కుమారుడైన లోహిత్‌కుమార్ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్టు సీఐ నమ్మి గణేశ్ తెలిపారు.

సారా విక్రయదారుడి అరెస్టు

మునగపాక, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడకపాలెం గ్రామ శివారులో సారా విక్రయిస్తున్న ఎల్.బాబూరావును మంగళవారం అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ ఎస్ఐలు వైఎల్.నాయుడు, కేఎస్.గణేష్ తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడి చేయగా రెండు లీటర్ల సారాతో బాబూరావు పట్టుబడినట్టు ఆయన చెప్పారు. కేసు నమోదు చేసి, అరెస్టు చేశామని తెలిపారు.

బల్క్‌డ్రగ్ పార్క్‌కు భూములు ఇవ్వబోమని ఆందోళన


జానకియ్యపేటలో ఆందోళన చేస్తున్న రైతులు

నక్కపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకియ్యపేటలో బల్క్‌డ్రగ్ పార్క్‌కు భూములు ఇచ్చేది లేదని పలువురు రైతులు స్పష్టంచేశారు. మంగళవారం గ్రామంలో బల్క్‌డ్రగ్ పరిశ్రమలకు వ్యతిరేకంగా పలువురు రైతులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జానకియ్యపేటలో 98 మంది రైతులకు చెందిన 198 ఎకరాలు ప్రభుత్వం బల్క్‌డ్రగ్స్ ఏర్పాటుకు భూసేకరణ చేస్తున్నట్టు పత్రికల్లో వచ్చిన ప్రకటనను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇప్పటికే భూముల సర్వే చేసినప్పుడు, అధికారులు గ్రామసభ నిర్వహించినప్పుడు తీవ్రంగా వ్యతిరేకించామన్నారు. అయినా అధికారులు ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి భూ సేకరణ నోటిఫికేషన్ ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేష్, జనసేన నాయకులు కురందాసు అప్పలరాజు, దేవర సత్తిబాబు, మామిడి బాబ్జి, పంపన బోయిన తులసీరావు, చందక నానాజీ, దేవర అప్పలరాజు, మామిడి గణేశ్, గింజాల అయ్యిలు, కె.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో 6,912 ఎకరాల్లో వరి సాగు : ఏవో


నామవరంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తున్న ఏఓ ఆదినారాయణ

పాయకరావుపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వర్షాలు ముందుగా పడే అవకాశమున్నందున మండలంలో ఖరీఫ్‌లో సాధారణ విస్తీర్ణం 6,912 ఎకరాల్లో వరి నాట్లు పడతాయని అంచనా వేసినట్టు మండల వ్యవసాయాధికారి పి.ఆదినారాయణ తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఖరీఫ్‌లో 910 క్వింటాళ్ల విత్తనాలకు ఇండెంట్ పెట్టామన్నారు. వీటిలో ఆర్‌జీఎల్ 2537, బీపీటీ 5204 (సాంబ మసూరి), ఎంటీయూ రకాలు ఉన్నాయన్నారు. 45 క్వింటాళ్ల జనుము, జీలుగు, కట్టిజనుము విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. చౌడు భూముల్లో తప్పనిసరిగా పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుని 40 రోజుల తరువాత దుక్కిలో కలియదున్నుకుంటే భూమి గుల్లబారి, సారవంతమవుతుందన్నారు. ఈ ఏడాది వంద శాతం ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి బయో విలేజిగా ఆర్.కొత్తూరును ఎంపిక చేసి పీఎండీఎస్ కిట్లు పంపిణీ చేశామని ఆయన తెలిపారు.

యోగాంధ్ర ప్రోటోకాల్ ఆసనాల శిక్షణ


కోటవురట్లలో యోగా చేస్తున్న అధికారులు, సిబ్బంది


మునగపాకలో యోగా సాధన చేస్తున్న సచివాలయాల ఉద్యోగులు

నక్కపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం నక్కపల్లిలో పలు ప్రభుత్వశాఖల ఉద్యోగులకు యోగాంధ్ర ప్రోటోకాల్ ఆసనాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సీతారామరాజు మాట్లాడుతూ నాలుగు రోజులపాటు నిర్వహించే శిక్షణలో పాల్గొన్న ఉద్యోగులు 50 మందికి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. యోగా గురువు ధవరసింగి రాంబాబు, మాస్టర్ యోగా ట్రైనర్లు ఎస్‌వీఎస్.ఆచార్యులు, సీహెచ్.ప్రసాద్, ఆదిత్య రుత్విక్, అప్పలరాజు ఉద్యోగులకు పలు ఆసనాలపై శిక్షణ ఇచ్చారు. మంగళవారం రెండు విడతలుగా సుమారు 130 మంది ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు నరసింహమూర్తి, ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ కె.రఘు తదితరులు పాల్గొన్నారు. డీఎల్.పురం జడ్పీ హైస్కూల్ ఆవరణలో మంగళవారం సాయంత్రం పిల్లలు, మహిళలకు నిర్వహించిన యోగా పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి.

రాంబిల్లిలో..

మండల కేంద్రంలోని రక్షిత తుఫాన్ భవనం వద్ద మంగళవారం యోగా శిక్షణ తరగతులను స్థానిక ఎంపీడీవో జయమాధవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగాను ప్రల్లోకి తీసుకువెళ్లేందుకు ఈ శిక్షణా తరగతులను నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం శిక్షకులు యోగాసనాలపై ప్రజలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ రాజు, వెలుగు ఏపీఎం పద్మ, పలు శాఖల అధికారులు,ఉద్యోగులు పాల్గొన్నారు.

కోటవురట్లలో..

కోటవురట్ల ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో మంగళవారం మండల స్థాయి అధికారులకు యోగాలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ తిరుమలబాబు మాట్లాడుతూ ఉద్యోగులందరూ ప్రతి రోజూ యోగా చేయడం వల్ల ఒత్తిడిని అధిగమించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథం, ఈవోపీఆర్డీ రఘురామ్, ఎంఈవో రామారావు, జోషి, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మునగపాకలో..

శరీర దృఢత్వం, పరిపూర్ణ ఆరోగ్యానికి యోగా ఒక ఔషధం లాంటిదని ఎంఈవో వేణుగోపాలరావు తెలిపారు. స్థానిక రాహుల్ గాంధీ కల్యాణ మండపంలో మంగళవారం యోగా సాధన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా ప్రాచీన కాలం నుంచి ఆచరణలో ఉందన్నారు. అనేక రుగ్మతులను యోగా దూరం చేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సోమరాజు, మండల పరిషత్ ఏవో, యోగా గురువు దొరమ్మనాయుడు, సచివాలయాల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రేమ వాహిని రథయాత్రకు అపూర్వ స్వాగతం

మునగపాక, మే 27 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సత్యసాయి ప్రేమ వాహిని రథయాత్రకు అపూర్వ స్వాగతం లభించింది. సత్యసాయి సేవా సంస్థలు అనకాపల్లి జిల్లా జోన్-1 ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం స్థానిక మెయిన్‌రోడ్డు కాశీ విశ్వేశ్వర ఆలయం నుంచి రథయాత్ర మొదలైంది. తొలుత సాయిబాబా చిత్రపటానికి, పాదరక్షకులకు ప్రత్యేక పూజలు నిర్వహించి, నగర సంకీర్తన చేశారు. వినాయకుడు, ఆంజనేయుడు, షిర్డీసాయి, సత్యసాయి వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థలు జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు, తిమ్మరాజుపేట భజన మండలి కన్వీనర్ సరిసా శివ గణేష్, అందలాపల్లి, గణపర్తి భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.


మునగపాకలో నిర్వహిస్తున్న రథయాత్రలో పాల్గొన్న భక్తులు

ఆవకాలువ గట్టు సర్వే

- సంఘం చైర్మన్ ఆడారి ఆనంద్ సన్యాసినాయుడు

మునగపాక, మే 27 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఆవకాలువకు సంబంధించిన గట్టు సర్వే జరుగుతోందని ఆ సంఘం చైర్మన్ ఆడారి ఆనంద్ సన్యాసినాయుడు తెలిపారు. మంగళవారం జరిగిన సర్వే పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాగునీటి చిన్న, మధ్య, భారీ కాలువలకు పూర్వవైభవం తీసుకు రావడం లక్ష్యంగా ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పనులు చేయిస్తున్నారని తెలిపారు. కాలువగట్టుపై ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించి గట్టు పటిష్ఠతకు సహకరించాలన్నారు. పనులను పరిశీలించిన వారిలో మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్, కూటమి నాయకులు పొలమరశెట్టి మురళి, దొడ్డి రమేష్, బొడ్డేడ రాము ఉన్నారు.


అనకాపల్లి ఆవకాలువ గట్టు సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఎస్.రాయవరం, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా అడ్డరోడ్డు తిమ్మాపురం, కోనవానిపాలెం, కొరుప్రోలు, పెదగుమ్ములూరు, నక్కపల్లి మండలం సారిపల్లిపాలెం గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు పట్టణంలో జనవాణి

ఎలమంచిలి, మే 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి జనవాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కార్యాలయ సిబ్బంది తెలిపారు. జనవాణిలో ఎమ్మెల్యే విజయకుమార్ ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించనున్నారని తెలిపారు. పట్టణ, మండల ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలను అందజేయాలని సిబ్బంది కోరారు. జనవాణిలో వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వినియోగించుకోవాలన్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

మునగపాక, మే 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైతు సేవా కేంద్రంలో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మునగపాక వ్యవసాయ సహాయకురాలు గౌరీ సింధూజ తెలిపారు. జనుము పది కేజీల ధర రూ.545లు, జీలుగ పది కేజీలు ధర రూ.615లు, పిల్లి పెసర 8 కేజీలు రూ.720 అని ఆమె తెలిపారు. అవసరమైన రైతులు ఆధార్‌కార్డుతో రైతు సేవ కేంద్రానికి రావాలని కోరారు.

పైడితల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే


పైడితల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరబుపాలెంలో శెట్టిబలిజ ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి పండుగ మంగళవారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. కమిటీ సభ్యులు సాదర స్వాగతం పలికారు. ఆయన వెంట జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం, శరగడం యోగి నాగేశ్వరరావు, బొడ్డేడ గంగాధర్, తుట్టా వెంకటి, పి.దుర్గారావు, కాకి రమణబాబు, మొల్లేటి ఆనంద్, శెట్టిబలిజ యువకులు పాల్గొన్నారు.

'పేట'లో జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి

పాయకరావుపేట, మే 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం మాజీ ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులు జవహల్‌లాల్ నెహ్రూ జీవిత చరిత్ర, దేశానికి ఆయన చేసిన సేవలు వివరించారు. అదేవిధంగా విద్యార్థులకు నీతి కథలు చెప్పడం, రాయించడం, భగవద్గీత శ్లోకాలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు వై.అచ్చుతరావు, తాళరావు, గ్రంథాలయ ఇన్‌చార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయంలో సప్తాహం ప్రారంభం


దుర్గమ్మ ఆలయంలో హరిభజన చేస్తున్న మహిళలు

ఎస్.రాయవరం, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారంలో దుర్గమ్మ ఆలయంలో మంగళవారం నుంచి సప్తాహం హరి భజనలు ప్రారంభమయ్యాయి. జూన్ నెల 3వ తేదీన నిర్వహించే దుర్గమ్మ 16వ వార్షికోత్సవంలో భాగంగా అమ్మవారి ఆలయంలో ఈ వారం రోజులపాటు హరి భజనలు ఏర్పాటు చేశామని కమిటీ సభ్యులు తెలిపారు.

మొక్కుబడిగా పనిచేస్తే కుదరదు : ఎంపీడీవో


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సీతారామరాజు

నక్కపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు నిర్లక్ష్యంగా పనిచేస్తే ఇబ్బందులు తప్పవని ఎంపీడీఓ డి.సీతారామరాజు హెచ్చరించారు. మంగళవారం నక్కపల్లిలో నిర్వహించిన సమావేశంలో మొక్కుబడిగా పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. కలెక్టర్‌లు, ఉన్నతాధికారులు, ప్రభుత్వం యోగాంధ్రని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంటే సమావేశాలకు సమయానికి ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఇకపై ఉద్యోగులు సమయపాలన పాటించకపోయినా, సక్రమంగా బాధ్యతలు నిర్వహించక పోయినా చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. బుధవారం ఉదయం 7.30 గంటల నుంచి జరిగే యోగాంధ్ర ప్రోటోకాల్ ఆసనాల శిక్షణ కార్యక్రమానికి ఎవరైనా డుమ్మాకొడితే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ డి.సీతారామరాజు హెచ్చరించారు.

ఘనంగా నేస్తాలమ్మ జాతర

ఎస్.రాయవరం, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వమ్మవరం గ్రామంలో నేస్తాలమ్మ జాతరను మంగళవారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్థానికలతోపాటు చుట్టుపక్కల భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. భక్తులకు కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యుతవ పాల్గొన్నారు.

పాస్టర్ల సంఘం మండల కార్యవర్గం


రాంబిల్లి మండల పాస్టర్ల సంఘం కార్యవర్గం ఇదే

రాంబిల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పన్నపాలెం గ్లోరియా ఇమ్మానియేల్ చర్చిలో మంగళవారం జరిగిన మండల పాస్టర్ల సంఘం కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా బి.జాషువారాయ్, ఉపాధ్యక్షుడిగా సీహెచ్ పరంజ్యోతి, కార్యదర్శిగా వి.డేవిడ్, సహాయ కార్యదర్శిగా ఎస్. ప్రసాద్, కోశాధికారిగా సీహెచ్ శామ్యూల్ ఐజక్, సహాయ కోశాధికారిగా జి.శామ్యూల్ ప్రసాద్, ముఖ్య సలహాదారులుగా ఎం.సుధీర్, ప్రేమ్‌కుమార్, యేసుపాదం, కె.జగదీష్‌పాల్, కె.కృపారావు, సహాయ సలహాదారులుగా సుదర్శన్, సాల్మన్‌రాజు, విజయకుమార్, అప్పారావు తదితర సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నేటి నుంచి యోగా శిక్షణ తరగతులు

ఎలమంచిలి, మే 27 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మునిసిపాలిటీ పరిధిలో యోగా శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్టు మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. 200 మందికి శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈనెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు.

సందడిగా ముత్యాలమ్మ పండుగ


ముత్యాలమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

రాంబిల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడనర్సాపురంలో మంగళవారం ముత్యాలమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని స్థానికులే కాకుండా సమీప గ్రామాలకు చెందిన భక్తులు పసుపు, కుంకుమలను సమర్పించారు. తమ మొక్కులను చెల్లించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలోఅన్నసమారాధనను నిర్వహించారు. విద్యుత్ అలంకరణ, అధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.



మహానాడులో పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబుతో చోడవరం నేతలు

మహానాడులో టీడీపీ నేతల సందడి

చోడవరం, మే 27 (ఆంధ్రజ్యోతి): మహానాడులో స్థానిక తెలుగుదేశం నాయకులు సందడి చేస్తున్నారు. ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబులతో నేతలు మహానాడు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, టీడీపీ నాయకులు కనిశెట్టి మత్స్యరాజు, పూతి కోటేశ్వరరావు, సకురు కోటేశ్వరరావు, రామునాయుడు, ఇతర నేతలు మహానాడు ప్రాంగణంలో తొలిరోజు ఆనందంగా గడిపారు.

బుచ్చెయ్యపేటలో..

కడపలో జరుగుతున్న మహానాడులో టీడీపీ మండల నేతలు సందడి చేస్తున్నారు. తొలిరోజు మంగళవారం మహానాడు పండగలా జరిగిందని టీడీపీ నేతలు తెలిపారు. సభ వేదిక వద్ద ఏర్పాట్లు, భోజనాలు, పార్కింగ్, ఇతర సదుపాయాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు జి.కోటేశ్వరరావు, సింగంపల్లి రమేశ్, సయ్యపురెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించరా..?



ఉపాధి పనులు కల్పించడం లేదని ఏపీవోను ప్రశ్నిస్తున్న మహిళలు

మాకవరపాలెం, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వజ్రగడ గ్రామంలో ఉపాధి పనులు ఎందుకు కల్పించడం లేదని మహిళలు ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం ఏపీవో కాశీని కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు వారాలు మాత్రమే ఉపాధి పనులు కల్పించారని, సిబ్బందిని ఎన్నిసార్లు ప్రశ్నించినా ఫలితం లేకపోతున్నదని పేర్కొన్నారు. పనులు లేక గ్రామంలో ఖాళీగా ఉంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి చేసిన పూర్తి స్థాయిలో పనులు కల్పించాలని వారు కోరారు.

గెడ్డలో మట్టి తవ్విన ముగ్గురిపై కేసు

కశింకోట, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉగ్గినపాలెం రెవెన్యూ పరిధి కొత్తపల్లి బుచ్చెయ్యపేట వద్ద రంగబోలుగెడ్డలో మట్టి తవ్వకాలు జరిపిన ముగ్గురిపై కేసు నమోదు చేశామని సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. రంగబోలు గెడ్డలో మట్టి అక్రమ తవ్వకాలపై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన తహసీల్దార్ జి.సత్యనారాయణ మట్టి తవ్వకందారులను గుర్తించి కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన పోలీసులు కొత్తపల్లి బుచ్చెయ్యపేట గ్రామానికి చెందిన కె.వెంకట త్రినాథ్, ఎం.బాలాజి, ఎం.నాగేశ్వరరావు మట్టి తవ్వకుపోయినట్టు గుర్తించి కేసు నమోదు చేశారు.

ఎప్పుడు తెరుస్తారో.. ఎప్పుడు మూస్తారో..?

- సమయానికి తెరచుకోని వెలుగు కార్యాలయం
- పని వేళలు పాటించని ఉద్యోగులు.. మండిపడుతున్న ప్రజలు



ఉదయం 11 గంటల సమయంలో కూడా తెరచుకోని వెలుగు కార్యాలయం

నాతవరం, మే 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయాన్ని ఎప్పుడు తెరుస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఉద్యోగులు పనివేళలు పాటించకపోవడంతో కార్యాలయం ఎప్పుడు తెరచుకుంటుందో.. ఎప్పుడు మూతపడుతుందో తెలియని దుస్థితి దాపురించింది. వెలుగు కార్యాలయానికి వివిధ పనులపై కొందరు ప్రజలు రాగా, తలుపులు వేసి ఉండడంతో నిరాశతో వెనుదిరిగారు. వెలుగు ఏపీఎం కనకరాజు లేకపోయినప్పటికీ, కనీసం సిబ్బంది కూడా కార్యాలయం పనివేళల ప్రకారం తెరవకపోవడం దారుణమని స్థానికులు మండిపడుతున్నారు. సోమవారం ఉదయం 11 గంటలైనా కార్యాలయం తెరిచి లేదు. వెలుగు ఏపీఎం కనకరాజు వివరణ కోరగా వేరే చోటకు వెళ్లడం జరిగిందని, సిబ్బందిని పనివేళల ప్రకారం కార్యాలయం తెరవాలని సూచించామని చెప్పారు. ఏదేమైనా కార్యాలయ సిబ్బంది పని వేళలు కచ్చితంగా పాటించేలా అధికారులు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

యోగాతో ఆరోగ్యం మెరుగు: కలెక్టర్



ముత్యాలమ్మపాలెం బీచ్‌లో యోగా చేస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పరవాడ, మే 27 (ఆంధ్రజ్యోతి): రోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యం మెరుగ్గా వుంటుందని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. యోగాంధ్ర-2025లో భాగంగా మంగళవారం ముత్యాలమ్మపాలెం బీచ్‌లో యోగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ, యోగా సాధనను దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ, రోజూ గంట సమయాన్ని యోగాకు కేటాయిస్తే వ్యాధులు దరిచేరవని అన్నారు. నెల రోజులపాటు జరిగే యోగా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం యోగాసనాలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌డీసీ అనిత, తహసీల్దార్ అంబేడ్కర్, పరవాడ, సబ్బవరం ఎంపీడీవోలు బి.రమేశ్‌నాయుడు, పి.పద్మజ, మండల ప్రత్యేకాధికారి సరోజిని, సర్పంచ్ చింతకాయల సుజాత, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తూనికల్లో జాగ్రత్తలు పాటించండి

- జిల్లా తూనికలు, కొలతల అధికారి జి.రామచంద్రరావు



రేషన్ డీలర్లకు సూచనలు ఇస్తున్న తూనికలు, కొలతల శాఖాధికారి

మాకవరపాలెం, మే 27 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరకుల తూనికలో పలు జాగ్రత్తలు పాటించాలని జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి జి.రామచంద్రరావు సూచించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎస్ స్టాక్ పాయింట్ వద్ద రేషన్ సరకులు తెచ్చుకునేటప్పుడు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు .అలాగే లబ్ధిదారులకు రేషన్ సరుకులు ఇచ్చేటప్పుడ ుకొలతల్లో తేడా రాకూడదని ఆయన స్పష్టం చేశారు. నాణ్యమైన సరకులతో పాటు సక్రమంగా కొలతలతో సరకులు అందించాలని చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే సరకులు ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. అనంతరం రేషన్ దుకాణాల డీలర్లు తూనికల కాటాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీలర్లు పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి నుంచి ఉపశమనం

నాతవరం, మే 27 (ఆంధ్రజ్యోతి): యోగా చేయడం వల్ల ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుందని ఎంపీడీవో ఉషశ్రీ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని వివిధ శాఖల ఉద్యోగులతో సోమవారం యోగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఉషశ్రీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగా చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. జూన్ 21వ తేది వరకు యోగా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంబీపట్నం ఫిజికల్ డైరెక్టర్ అపిరెడ్డి లచ్చబాబు, నాతవరం పిజికల్ డైరక్టర్ కోటేశ్వరరావు, తాండవ ఫిజికల్ డైరెక్టర్ శివ పాల్గొన్నారు.



మండల పరిషత్ కార్యాలయంలో యోగాలో పాల్గొన్న వివిధ శాఖల ఉద్యోగులు

పచ్చిరొట్ట విత్తనాలతో నేల సారవంతం

నర్సీపట్నం, మే 27 (ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట ఎరువులను సాగు చేసి పూత దశకు వచ్చిన తర్వాత నేలను కలియదున్నితే నేల సారవంతమవుతుందని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సీపట్నం సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలలో 104 క్వింటాళ్ల పచ్చిరొట్ట పంపిణీకి విత్తనాలు సిద్ధం చేసి ఉంచామని అన్నారు. ప్రభుత్వం 50 శాతం రాయితీతో అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మోస్తరు వర్షం

కృష్ణాదేవిపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పుల కారణంగా గొలుగొండ మండలంలోన పలు ప్రాంతాల్లో మంగళవారం వర్షం పడింది. ప్రధానంగా ఏఎల్‌పురం, కొంగశింగి, సీహెచ్.నాగాపురం, పాతకృష్ణాదేవిపేట, లింగంపేట తదితర గ్రామాల్లో వర్షం పడడంతో సీసీ రోడ్డుపై వర్షం నీరు ఏరులై పారింది. అలాగే గోతులుమయంగా ఉన్న గ్రామీణ రహదారుల్లో వర్షం నీరు చేరి అధ్వానంగా తయారయ్యాయి. వర్షం కారణంగా మట్టి రోడ్డు బురదగా మారడంతో పాటు వీధి మార్గాలు వర్షం నీటితో డ్రైనేజీలో నీరు ఎటు పోలేని దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పిడుగు పాటుకు పాడి గేదె మృతి

రావికమతం, మే 27 (ఆంధ్రజ్యోతి): రావికమతంలో పిడుగు పడి పాడి గేదె మృతి చెందింది. మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసిన సమయంలో పిడుగు పడడంతో గ్రామానికి చెందిన కంఠం రెడ్డి నాయుడుకు చెందిన పాడి గేదె మృతి చెందింది. తన జీవనాధారమైన పాడిగేదె మృతితో నాయుడు విలపించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కొత్త రేషన్ కార్డులకు పోటెత్తుతున్న అర్జీదారులు

చీడికాడ, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రేషన్ కార్డుల మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానించడంతో అర్జీదారులు పోటెత్తుతున్నారు. కోనాం సచివాలయానికి అధిక సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. ప్రతి రోజూ కోనాం సచివాలయ పరిధిలోని 16 గ్రామాల నుంచి వచ్చి దరఖాస్తులు చేస్తున్నారు. బుధవారం వీఆర్‌వో జీవీ.మూర్తి, కార్యదర్శి ఎస్.సింహాచలంనాయుడు ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. ఇంతవరకూ 72 దరఖాస్తులు వచ్చాయని, ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చునని వారు తెలిపారు.

ఘనంగా సత్యసాయి ప్రేమవాహిని రథయాత్ర



భక్తిశ్రద్ధలతో రథయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

కె.కోటపాడు, మే 27 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రేమవాహిని రథయాత్ర మండలంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత వారాడ గ్రామంలో రథయాత్ర ప్రారంభమై ఏ.కోడూరు, సింగన్నదొరపాలెం, కె.కోటపాడు మీదుగా కింతాడ శివారు కూండ్రపువానిపాలెంకు చేరుకుంది. ముగింపు కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా స్పిరిచువల్ కో-ఆర్డినేటర్ కామరాజు సత్యసాయి చేసిన సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో కసిరెడ్డి అప్పలనాయుడు, శంకర్ శక్తిమూర్తి, కన్నూరు అప్పలనాయుడు, రవిశంకర్, బండారు నారాయణపాత్రుడు, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


ఎంఆర్ టీకా కార్యక్రమం పరిశీలన



పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న చంద్ర శేఖర్‌దేవ్

రావికమతం, మే 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 35,840 మంది పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేయాలని లక్ష్యంగా తీసుకున్నామని జిల్లా ఇమ్మునైజేషన్ ప్రోగ్రాం అధికారి కె.చంద్రశేఖర్‌దేవ్ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న ప్రత్యేక టీకా కార్యక్రమాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గత మూడేళ్లగా జిల్లాలో 35,840 మంది పిల్లలకు ఎంఆర్(అమ్మవారు,తట్టు) టీకాలు వేయలేదని, వీరందరికీ ఈనెల 26 నుంచి 31వ తేదీ లోగా టీకాలు వేస్తున్నామన్నారు. అంతకుముందు ఆయన పీహెచ్‌సీలో ఉన్న వ్యాక్సినేషన్ ఐఎల్ఆర్, డీప్రీజర్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ పి.రాముడు, వైద్యాధికారులు ఎస్.శ్రీనివాస్, డి.పుష్పలత, సిహెచ్ఓ కె.హేమసుందరరావు, హెచ్ఎస్‌కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

వర్షంతో బీఎన్ రోడ్డులో వాహన చోదకుల కష్టాలు



బీఎన్.రోడ్డులో గుంతలో చేరిన వర్షపునీరు

బుచ్చెయ్యపేట, మే 27(ఆంధ్రజ్యోతి): వర్షం కురిస్తే మండలంలోని బీఎన్ రోడ్డులో ప్రయాణం నరకప్రాయంగా మారింది. వాన వస్తే గోతుల్లో నీరు చేరి చెరువులను తలపిస్తోంది. వడ్డాది పెట్రోల్‌బంక్, విజయరామరాజుపేట వద్ద భారీ గుంతల్లో నీరు చేరి ద్విచక్రవాహనం కూడా వెళ్లడానికి అవకాశం లేకుండా మారింది. అలాగే తాచేరు వంతెన స్థానంలో వేసిన డైవర్షన్ రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు పడి రాళ్లు తేలి ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు మరమ్మతులు చేపట్టి వాహనదార్లకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

దంచికొట్టిన వాన

- పలు మండలాల్లో భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం



చోడవరం పట్టణంలో వర్షం కురుస్తున్న దృశ్యం

చోడవరం, మే 27 (ఆంధ్రజ్యోతి): వాతావరణ ప్రభావంతో మంగళవారం సాయంత్రం మండలంలో భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 2.30 గంటలకు ఉరుములు, మెరుపులతో గంటకు పైగా వర్షం దంచికొట్టింది. భారీ వర్షానికి వాన నీరు ప్రధాన రహదారితో పాటు కాలనీల్లో రోడ్లను ముంచెత్తింది. వీధుల్లో కాలువలను వరదనీరు పారింది.

రావికమతంలో..

మండలంలో ప్రతిరోజూ ఉదయం పూట ఎండ కాసి, మధ్యాహ్నం నుంచి వర్షం కురుస్తోంది. మంగళవారం మధ్యాహ్నం ఈదురగాలులతోపాటు పెద్ద పెద్ద ఉరుములతో భారీ వర్షం కురిసింది. వర్షపు నీటిలో డ్రైనేజీలు పొరక రోడ్లపై ప్రవహించాయి. గ్రామీణ రోడ్లు ఛిద్రంగా మారాయి. బీఎన్ రోడ్డులో మేడివాడ వద్ద మరింత అధ్వానంగా మారి, చెరువును తలపిస్తున్నది. ఉరుములు, ఈదురగాలులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



రావికమతం: మేడివాడ మెయిన్ వీధిలో మోకాళ్ల లోతు చేరిన వర్షపు నీరు

దేవరాపల్లిలో..

మండలంలో మంగళవారం సాయంత్రం మోస్తరు వర్షం పడింది. ఉదయం నుంచి ఎండ ప్రచండం కాగా సాయంత్రం వర్షంతో చల్లబడింది. వేసవి దుక్కులు, నారుమల్లు సిద్ధం చేయడానికి, సరుగుడు, కూరగాయలు పంటలకు ఈ వర్షం ఉపయోగపడుతుందని రైతులు తెలిపారు.

మాడుగుల/రూరల్‌లో..

మండలంలో మంగళవారం మోస్తరు వర్షం పడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వాతావరణం పొడిగానే ఉంది. ఆ తర్వాత వాతావరణంలో ఒక్కసారిగా మార్పు వచ్చి వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది.

చీడికాడలో

మండలంలో మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి 2 గంటల వరకూ మండే ఎండకు జనం అల్లాడిపోయారు. మధ్యాహ్నం 3గంటలకు మేఘాలు కమ్ముకొని వర్షం కురవడంతో జనం ఉపశమనం పొందారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : ఎంపీడీవో

చోడవరం, మే 27 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, ప్రతి ఒక్కరూ యోగాపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఎంపీడీవో వీ ఎస్‌జే ఆంజనేయులు తెలిపారు. మంగళవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి స్థానిక కల్యాణ మండపంలో యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పర్యవేక్షణ అధికారి మంజులవాణి, ఈవోపీఆర్‌డీ మహేష్, యోగా గురువు పుల్లేటి సతీష్, యోగా శిక్షకులు, పంచాయతీ ఈవో నారాయణరావు పాల్గొన్నారు.

రోలుగుంటలో..

యోగాంధ్రలో భాగంగా మంగళవారం మాస్టర్ ట్రైనీల ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈనెల 31వ తేదీ వరకు శిక్షణ కొనసాగుతుందని, తొలి రోజు 150 మందికి శిక్షణ ఇచ్చినట్టు ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగమ్మ, ఎంఈఓ జగ్గారావు పాల్గొన్నారు.

మాడుగులలో..

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో కొంకి అప్పారావు అన్నారు. యోగాంధ్రలో భాగంగా మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో యోగా శిక్షణకార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజారాం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దేవరాపల్లిలో..

యోగాతో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని ఎంపీడీఓ ఎంవీ సువర్ణరాజు అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉద్యోగులకు యోగా శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. యోగా గురువు గెడ్డం నగేషు పర్యవేక్షణలో మాస్టర్ ట్రైనీలు డి.బాబూరావు, సూర్య ప్రకాష్, బి.రాధిక యోగాసనాలను సాధన చేయించారు. ఆయుర్వేద వైద్యులు గ్రీష్మ ఏఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



చోడవరంలో యోగా శిక్షణ పొందుతున్న అధికారులు

కె.కోటపాడులో..

మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం నుంచి జరుగుతున్న యోగా శిక్షణ తరగతులను ఎంపీడీవో సాంబశివరావు పరిశీలించారు. కార్యక్రమంలో యోగా టీచర్ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శ్రీను, జవ్వాది సన్యాసిరావు, పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చీడికాడలో..

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎంపీడీవో వి.హేమసుందర రావు అన్నారు. మంగళవారం చీడికాడ హైస్కూల్ ఆవరణలో యోగా శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా టీపీటీలు వై.ఈశ్వరబాబు, ఆర్.సింహాచలం, ఈవోపీఆర్‌డీ ఎం.కామేశ్వరరావు, నాయుడు, పంచాయతీ కార్యదర్శి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



మాడుగులలో యోగాసనాలు వేస్తున్న మండల అధికారులు



కె.కోటపాడులో యోగా శిక్షణ పొందుతున్న అధికారులు

ఉపాధి హామీ శ్రామికుల భిక్షాటన



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధి హామీ శ్రామికులు

దేవరాపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): బకాయిలు చెల్లించాలని ఉపాధి హామీ శ్రామికులు మంగళవారం భిక్షాటన చేసి నిరసన తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న ఆధ్వర్యంలో దేవరాపల్లి, శ్రీరాంపురం, నందిపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ ఉపాధి హామీ శ్రామికులకు మార్చి నెల నుంచి బకాయిలు ఇవ్వలేదన్నారు. వారి జీవనానికి ఇబ్బందిగా మారిందని, అందువల్లే భిక్షాటన చేశారన్నారు.

మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ముత్యాలరావు



సమావేశంలో మాట్లాడుతున్న భిక్షాలు

చోడవరం, మే 27 (ఆంధ్రజ్యోతి): మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా నీటిపల్లి ముత్యాలరావు నియమితులయ్యారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ భవనంలో నిర్వహించిన మాదిగ ఉద్యోగుల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కండెల్లి వెంకటరావు, ప్రధాన కార్యదర్శిగా ఈశ్వరరావు, అదనపు సహాయ కార్యదర్శిగా దేవుడుబాబు, ఉపాధ్యక్షుడిగా కొత్తల ఈశ్వరరావు, కొల్లి నాగభూషణం, జిల్లా కార్యదర్శిగా ఎలుచూరి నాగరాజు, జిల్లా సహాయకార్యదర్శిగా చింతాడ కొండలరావు నియమితులయ్యారు. ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మోర్త శ్రీనివాసరావు కోశాధికారిగా అప్పారావు నియమితులయ్యారు. ఈ సమావేశానికి రాష్ట్ర మాదిగ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దేవరపల్లి భిక్షాలు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశంలో జిల్లా నాయకులు గజ్జల సత్యనారాయణ, మల్లిబాబు, గాటీలు, మంగరాజు తవితరులు పాల్గొన్నారు.

జీవో నంబర్ 4పై పునరాలోచించాలి : వీఆర్వోలు

కె.కోటపాడు, మే 27 (ఆంధ్రజ్యోతి): రేషన్‌లైజేషన్ పేరుతో గ్రామ రెవెన్యూ అధికారుల సంఖ్యను తగ్గిస్తూ ఇచ్చిన జీవో నంబరు -4పై ప్రభుత్వం పునరాలోచించాలని మండల వీఆర్వోలు కోరుతున్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్ఓ సంఘం మండల అధ్యక్షుడు అనంత్, వీఆర్వో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పూడి సురేష్ విలేకరులతో మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన రెండు సచివాలయాలకు క్లస్టర్ ఏర్పాటు చేసి వీఆర్వోలను తగ్గించారన్నారు. కార్యక్రమంలో శివ కుమార్, గౌరీశంకర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సన్యాసమ్మ ఒడ్డు పండుగ

దేవరాపల్లి, మే27 (ఆంధ్రజ్యోతి): స్థానిక చిన్నంనాయుడునగర్ వద్ద సన్యాసమ్మ ఒడ్డు పండుగ మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి మహిళలు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. ధర్మకర్త వరదపురెడ్డి చంద్రరావు, గౌరీ ప్రసాద వితరణ చేశారు.

భూమిగట్టు వివాదంలో ఒకరికి గాయాలు

బుచ్చెయ్యపేట, మే 27 (ఆంధ్రజ్యోతి):మండలంలో మల్లాం భూపతిపాలెంపలో భూమి గట్టు వివాదంలో ఇరువర్గాలు కొట్లాటకు దిగాయి. ఈ కొట్లాటలో గ్రామానికి చెందిన అప్పన కొండలరావు (38) తలకు గాయమైంది. దెబ్బలు తిన్న వెంటనే బాధితుడు బుచ్చెయ్యపేట పోలీస్ స్టేషన్‌కు చేరుకోగా.. అనకాపల్లి ఆస్పత్రికి వైద్యం నిమిత్తం తరలించారు.కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

గోతుల మయం.. ప్రమాదాల భయం

- ముంచింగిపుట్టు- పూలుగుడ నుంచి వెళ్లే రహదారి దుస్థితి
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- ఐదు గిరిజన గ్రామాల వాసులకు అవస్థలు

అనంతగిరి, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టోకూరు పంచాయతీ పరిధిలోని ములియగుడ- పూలుగుడ రోడ్డు నుంచి రాయివలస మీదుగా పింపుడువలస, ఎగువకంబవలస, దిగువకంబవలస గ్రామాలను కలుపుకుని వెళ్లే రింగ్ రోడ్డు అధ్వానంగా మారింది. గత ప్రభుత్వంలో ఈ రోడ్డును రూ.1.50 కోట్లతో నిర్మించారు. అయితే, మూడేళ్లకే అధ్వానంగా మారింది.. కాంట్రాక్టర్ ఐదేళ్లలోపు నిర్వహణ బాధ్యతలు చేపట్టాల్సి ఉన్నా, కనీస మరమ్మతులపై పట్టించుకోలేదని గిరిజనులు ఆరోపిస్తున్నారు. పెంపుడువలస, దిగువకంబవలస, ఎగువకంబవలస గ్రామాల వద్దరహదారి పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. చిన్నరోడ్డు కావడంతో ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించే క్రమంలో లోయలోపడే ప్రమాదం ఉందని పలువురు వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు.

చుట్టూ తిరిగి వెళ్లాల్సిందే..

పూలుగుడ మీదుగా రాయివలస, పింపుడువలస, ఎగువకంబవలస, దిగువకంబవలస గ్రామాలకు గిరిజనులు.. అటు డముకు నుంచి మైదాన ప్రాంతానికి వెళ్లేందుకు వీలుగా.. ఇటు టోకూరు, మండల కేంద్రానికి రాకపోకలకు వీలుగా ఈ రోడ్డు ఎంతో ఉపయోగపడుతుంది.ప్రస్తుతం రోడ్డు అధ్వానంగా మారడంతో డముకు మీదుగా కొండిబ, ములియగుడ వెళ్లాల్సి వస్తోందని, మైదాన ప్రాంతాలకు ములియగుడ మీదుగా ఎస్. కోట చేరుకోవాల్సి వస్తోందని ఆయా గ్రామాల గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి, రోడ్డు మరమ్మతు చేపట్టి కష్టాలు తీర్చాలని గిరిజనులు కోరుతున్నారు.



దిగువకంబవలస వద్ద ఛిద్రమైన రహదారి



ఎగువకంబవలస గ్రామ సమీపంలో కోతకు లోనైన దృశ్యం

బదిలీల్లో ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని వినతి



పశు సంవర్ధక శాఖ డైరెక్టర్‌కు సమస్య విన్నవిస్తున్న జిల్లా అధ్యక్షుడు సాగిరి గణేశ్వరరావు

అనంతగిరి, మే 27 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో పశుసంవర్ధక శాఖలో చేపడుతున్న బదిలీల్లో ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని విజయవాడలోని పశుసంవర్ధకశాఖ రాష్ట్ర సంచాలకులు దమోదర్ నాయుడును కలిసి అల్లూరి జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సాగిరి గణేశ్వరరావు మంగళవారం కోరారు. నిబంధనల అనుసరించి బదిలీలు నిర్వహించాలని, రాజకీయ పైరవీలు లేకుండా చూడాలని విన్నవించారు. ఏజన్సీలో పనిచేసిన ఉద్యోగులను మైదాన ప్రాంతానికి, అక్కడ విధులు నిర్వహించిన ఉద్యోగులను గిరిజన ప్రాంతానికి బదిలీలు చేయాలని కోరారు. అలాగే, గిరిజన ప్రాంతంలో రెండేళ్ల పనిచేసిన ఉద్యోగులకు బదిలీ కల్పించి, మొదటి ప్రాధాన్యం కల్పించాలని వివరించారు.

యోగా ట్రైనర్లకు శిక్షణ



యోగా శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్లు

చింతపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ యోగా దినోత్సవంలో ప్రజలను భాగస్వాములను చేసేందుకు గ్రామ స్థాయి ట్రైనర్లకు శిక్షణ ఇస్తున్నట్టు ఎంపీడీవో యాఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం గ్రామ స్థాయి ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మూడు రోజులపాటు మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ అందిస్తామన్నారు. ఇందులో నేర్చుకున్న యోగాసనాలు ట్రైనర్లు గ్రామ స్థాయిలో జూన్ 5 నుంచి ఏడు వరకు స్వయం సహాయ సంఘ సభ్యులకు, తొమ్మిదో తేదీ నుంచి 11 వరకు రైతులు, వివిధ వృత్తులవారికి, 12 నుంచి 14 వరకు యువత, విద్యార్థులకు శిక్షణ అందిస్తారన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్నిప్రజలంతా జయప్రదం చేయాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాజంగి హోమియోపతి వైద్యాధికారి ఉదయ సందీప్, యోగా మాస్టర్ ట్రైనర్లు మోహన్, ఆమని పాల్గొన్నారు.

మద్యం, గంజాయి తరలిస్తే కేసులు



వాహన రికార్డులు పరిశీలిస్తున్న సీఐ సన్యాసినాయుడు

హుకుంపేట మే 27 (ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు మద్యం, గంజాయి తరలించినట్లయితే, కఠిన చర్యలు తప్పదని స్థానిక సీఐ సన్యాసి నాయుడు హెచ్చరించారు. మంగళవారం స్థానిక కామయ్యపేట జంక్షన్ వద్ద పాడేరు- అరకు ప్రధాన రోడ్డులో వాహన తనిఖీలు చేపట్టారు. వాహన రికార్డులు పరిశీలించారు. వాహన రికార్డులు, లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. సిబ్బంది పాల్గొన్నారు.

చిన్ననందిపుట్టుక గ్రామానికి బీటీ రోడ్డు నిర్మించాలని ఆందోళన

హుకుంపేట మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తక్షణమే చిన్ననందిపుట్టు గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేయాలని స్థానిక వైస్ఎంపీపీ కొండలరావు, గ్రామస్థులు డిమాండ్ చేశారు. మంగళవారం చిక్కుమద్దుల గ్రామస్థులతో కలిసి నందిపుట్టులో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించలేదని ఆరోపించారు. ఆ పార్టీ నేతలపై ఎంతో ఆశతో ఓట్లు వేసినా వారు పట్టించుకోలేదని అన్నారు. దీంతో గ్రామాల్లో గిరిజనులకు జ్వరాలు, గర్భిణుల వైద్య సేవలకు 108, 104 వాహనాలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్పందించి చిన్ననందిపుట్టు గ్రామానికి రోడ్డు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

గురుకుల కళాశాలల్లో ఇంటర్‌లో 505 సీట్లు భర్తీ

- గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎల్.రజని



ఏపీఆర్ విద్యార్థుల ధ్రువ పత్రాలను పరిశీలిస్తున్న డీడీ రజని

పాడేరురూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): పాడేరు ఐటీడీఏ పరిధిలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు మంగళవారం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 505 మందికి సీట్లు కేటాయించినట్టు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎల్.రజని తెలిపారు. స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో మంగళవారం ఆమె ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న విద్యార్థుల ప్రవేశాలకు చేపట్టిన కౌన్సెలింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని అరకు, పెదబయలు, జి.మాడుగుల, చింతపల్లి, కొయ్యూరు మండలాల్లోని 5 గిరిజన గురుకుల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీతోపాటు ఒకేషనల్ కోర్సులలో ఉన్న 800 సీట్లకు 828 మంది విద్యార్థుల నుంచి దరఖాస్తులు వచ్చాయన్నారు. వారికి గురుకుల కళాశాలల కన్వీనర్ ప్రిన్సిపాల్ యండమూరి పారయ్య, ఓఎస్‌డీ పీఎస్‌ఎన్.మూర్తి పర్యవేక్షణలో చేపట్టిన కౌన్సెలింగ్‌లో 505 మంది బాలురకు సీట్లను కేటాయించారన్నారు. ఇంకా, 295 సీట్లు ఖాళీగా ఉన్నట్టు వివరించారు. అర్హులైన ప్రతీ విద్యార్థికీ సీటు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ కౌన్సింగ్‌లో ఆయా గురుకుల కళాశాలల ప్రిన్సిపాళ్ల పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ శాఖలో ఉపాధ్యాయుల బదిలీకి జీవో 22 అమలు చేయాలి

- యూటీఎఫ్ నాయకులు డిమాండ్



ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

పాడేరురూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖలోని ఉపాధ్యాయుల బదిలీలకు జీవో 22ను అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో డాక్టర్ ఎంజే అభిషేక్ గౌడకు వినతిపత్రం అందించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల బదిలీలకూ ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల మాదిరిగా జీవో 22 ప్రకారం బదిలీ చేయాలన్నారు. ఉపాధ్యాయులకు బదిలీ కౌన్సెలింగ్ సందర్భంగా సర్వీస్ పాయింట్లను కేటాయించాలని, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీలకు ఒకే చోట ఎనిమిదేళ్ల కొనసాగించాలని, ఉపాధ్యాయ ఖాళీలను ముందుగా తెలియ జే యాలని, సీనియారిటీ జాబితాను ముందుగా ఆన్‌లైన్‌లో వెలువరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘనాయకులు మహేశ్వరరావు, పి.దేముడు, రఘునాథ్, సీహెచ్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తగినన్ని ఆధార్ నమోదు కేంద్రాలు లేక అవస్థలు



గిరిజనులతో కలిసి మాట్లాడుతున్న వైసీపీ నేత గిరిప్రసాద్

గూడెంకొత్తవీధి, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి పంచాయతీ గ్రామ సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వైసీపీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం జీకేవీధిలోని ఆధార్ కేంద్రానికి వచ్చిన గిరిజనులతో కలిసి ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలో 30శాతం మంది గిరిజనులకు ఇప్పటికీ ఆధార్ కార్డులేవని ప్రభుత్వ గణంకాలు చెబుతున్నాయన్నారు. మండలం మొత్తానికి జీకేవీధిలో మాత్రమే ఆధార్ నమోదు కేంద్రం ఉన్నదన్నారు. దీంతో పలు గ్రామాల ప్రజలు ఆధార్ సేవలు పొందేందుకు 30-50 కిలోమీటర్ల దూరంలోనున్న మండల కేంద్రానికి రావాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ స్థితిలో ప్రతి గ్రామ సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే ఆదివాసీల అవస్థలు తీరుతాయన్నారు. వైసీపీ నాయకులు అరుణ్, చంటిబాబు, పెసా కమిటీ సభ్యులు పరమేశ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

గూడెంకొత్తవీధి, మే 27 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆర్‌వీనగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్య అన్నారు. మంగళవారం శివారు గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. గ్రామంలో 65మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో పదిమంది జ్వరబాధితులకు రక్త పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఎపిడమిక్ సీజన్ ప్రారంభం కావడంతో గిరిజన గ్రామాల్లో జ్వరాలు, అతిసార, జలుబు, దగ్గు వ్యాధులు ప్రబలుతాయన్నారు. వ్యాధి సోకిన వెంటనే ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకోవాలన్నారు. జ్వరాలపై అశ్రద్ధ చేయరాదన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

జీసీసీ పూర్వ వైభవానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- డివిజనల్ మేనేజర్ బుక్కా వెంకటేశ్



సమావేశంలో మాట్లాడుతున్న డివిజనల్ మేనేజర్ వెంకటేశ్

చింతపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థ పూర్వ వైభవానికి ఉద్యోగులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్థానిక డివిజనల్ మేనేజర్ బుక్కా వెంకటేశ్ అన్నారు. మంగళవారం డివిజన్ కార్యాలయంలో జీసీసీ సేల్స్‌మేన్లు, వివిధ స్థాయి ఉద్యోగులతో డివిజనల్ మేనేజర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జీసీసీకి సుదీర్ఘ చరిత్ర ఉన్నదన్నారు. దళారీ వ్యవస్థను నిర్మూలించి, ఆదివాసీలు సేకరించిన అటవీ, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలనే లక్ష్యంతో 1956లో జీసీసీని ఏర్పాటు చేశారన్నారు. ఈసంస్థ పరిధిలో 25 గిరిజన ప్రాథమిక పరపతి సహకార సంఘాలున్నాయన్నారు. ఎండీ కల్పానా కుమారి జీసీసీ బలోపేతానికి చర్యలు ప్రారంభించారన్నారు. జూన్ ఒకటి నుంచి డీఆర్ డిపోల ద్వారానే రేషన్ బియ్యం పంపిణీ చేపడుతున్నట్టు వివరించారు. రైతులు సేకరించిన అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలన్నారు. అటవీ ఉత్పత్తుల ధరలను ప్రతి డీఆర్ డిపో వద్ద ప్రదర్శించాలన్నారు. జీసీసీ ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తీసుకొనిరావాలన్నారు. ఆదివాసీ రైతులు పండించిన కాఫీకి జీసీసీ మార్కెటింగ్ సదుపాయం కల్పించడంతో గరిష్ఠ ధరలు అందుతున్నాయన్నారు. గ్యాస్, పెట్రోల్ బంక్‌ల నిర్వాహణలోనూ ఉద్యోగులు బాధ్యతగా పనిచేస్తూ ప్రజలకు ఉత్తమ సేవలందించాలన్నారు. జీసీసీ సేవలపై గిరిజనులకు అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో జీసీసీ బ్రాంచి మేనేజర్ చల్లంగి సుగునాథం, గ్యాస్ ఇన్‌చార్జి ఎల్. రమణమూర్తి, ఎంఎల్ఎస్ గోదాం ఇన్‌చార్జి ఎంవీ రమణమూర్తి, అకౌంటెంట్ జె. జయశ్రీ, కాఫీ గోదాం ఇన్‌చార్జి శెట్టి చిన్నబ్బాయి, సేల్స్‌మన్ అధ్యక్షుడు బొడు రామారావు పాల్గొన్నారు.

ఉగ్ర దాడిపై పార్లమెంటులో ప్రత్యేక సమావేశం నిర్వహించాలి

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం



సమైక్యతా యాత్రలో మాట్లాడుతున్న లోకనాథం

పాడేరురూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడిపై ప్రత్యేకంగా పార్లమెంటు సమావేశం నిర్వహించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు కె. లోకనాథం డిమాండ్ చేశారు. మంగళవారం పాడేరులో నిర్వహించిన సమైక్యతా యాత్రలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. పహల్గాంలో గత ఏప్రిల్ 22న 26 మంది పర్యాటకులను టెర్రరిస్టులు బలిగొన్నారన్నారు. ఈ దాడిని ఖండించేందుకు దేశ ప్రజానీకమంతా ఐక్యంగా నిలవడం గొప్ప విషయమన్నారు. అలాగే, ఈ ఉగ్రదాడిపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను దేశ ప్రజలకు వివరించడానికి ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించాలని ఆయన కోరారు. ఉగ్రవాదులు దేశంలో మతపరమైన విభజన తీసుకురావాలని, మత విద్వేశాలు రెచ్చగొట్టాలని పథకం పన్నారన్నారు. దేశ ప్రజలు సమైక్యంగా నిలబడి ఆ పథకాన్ని వమ్ము చేశారన్నారు. భారత్- పాక్ మధ్య కాల్పుల విరమణకు సంబంధించి ఇరుదేశాల ప్రతినిధుల నుంచి అధికారిక ప్రకటన రాకుండానే అమెరికా అధ్యక్షుడు ప్రకటన విడుదల చేయడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోందన్నారు. సంక్షోభంలో ఉన్న అమెరికా ఆసియాలో ఆధిపత్యాన్ని కాపాడుకుంటూ మనలాంటి దేశాలపై సుంకాలు విధించి దోపిడీ చేయాలని చూస్తోందని విమర్శించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స మాట్లాడుతూ ఇతర దేశాల మద్దతుకు అన్ని పార్టీల ఎంపీలను ప్రతినిధి వర్గంగా పంపుతున్న మోదీ ప్రభుత్వం..దీనిపై పార్లమెంట్ సమావేశం నిరాకరించడం తగదన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కిల్లో సురేంద్ర, డి.గంగరాజు, వి.ఉమామహేశ్వరరావు, బీసీ పడాల్, పోతురాజు, త్రినాద్, పాలికి లక్కు, ఎల్.సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

జూన్ 12న గృహ ప్రవేశాలు

- హౌసింగ్ ప్రత్యేకాధికారి పీవీ రమణ



వంట్లమామిడిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న రమణ

పాడేరు, మే 27(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా11 వేల మంది లబ్ధిదారులకు చెందిన ఇళ్లలో జూన్ 12వతేదీన గృహప్రవేశాలు నిర్వహించనున్నట్టు హౌసింగ్ ప్రత్యేకాధికారి పీవీ రమణ తెలిపారు. జిల్లాలో గృహ నిర్మాణ సంస్థ పనితీరును పరిశీలించేందుకు మంగళవారం వచ్చిన ఆ యన మండలంలో వంట్లమామిడి గ్రామంలో పలువురు లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకుని వేగంగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో హౌసింగ్ అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశమై పలు సూచనలు చేశారు. జిల్లాలో 11, 477 ఇళ్ల నిర్మాణం లక్ష్యం కాగా, ప్రస్తుతానికి 4 వేల 691 ఇళ్లను మాత్రమే పూర్తి చేశారన్నారు. హౌసింగ్ అధికారులు, సిబ్బంది ప్రత్యే శ్రద్ధ వహించి, మిగిలిన 6 వేల 786 ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి జూన్ 12న మొత్తంఇళ్లకు గృహ ప్రవేశం చేసేందుకు సిద్ధంచేయాలనిరమణ ఆదేశించారు. ఈకార్యక్రమంలో హౌసింగ్ పీడీ బి.బాబు, డీఈఈ వి.రాజబాబు, ఏఈఈ ఈశ్వరరావు, ఇంజనీర్లు, వర్క్ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టిన వెంటనే శిశువులకు వ్యాక్సినేషన్

- డీఐవో కిరణ్‌కుమార్



చింతపల్లిలో ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న డీఐవో కిరణ్ కుమార్

చింతపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రుల్లో శిశువులు జన్మించిన వెంటనే వైద్యులు వ్యాక్సినేషన్ చేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి (డీఐవో) డాక్టర్ ఎం. కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం డీఐవో స్థానిక ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలను సూపరింటెండెంట్ పి. ఇందిరాప్రియాంకను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో జరుగుతున్న ప్రసవాలు, శిశువులక అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. ఈసందర్భంగా గర్భిణులు, బాలింతలు, వైద్యులతో ఆయన మాట్లాడుతూ శిశువులకు క్రమంగా వ్యాధి నిరోధక టీకాలు వేయించడం వల్ల వ్యాధులకు దూరంగా ఉంటారన్నారు. గర్భిణులు ఆస్పత్రిలోనే ప్రసవం పొందాలన్నారు. ఆస్పత్రిలో ప్రసవం పొందడం తల్లీ, బిడ్డకు క్షేమమన్నారు. గృహాల్లో ప్రసవాలు శ్రేయస్కరం కాదన్నారు. ఆస్పత్రిలో జన్మించిన వెంటనే శిశువులకు వైద్యులు, వైద్య సిబ్బంది పర్యవేక్షణలో విటమిన్-కె, బీసీజీ, హెపటైటిస్-బి టీకాలు వేస్తారన్నారు. వైద్యులు వ్యాక్సినేషన్‌పై తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ప్రసూతి వార్డు, అందుబాటులోనున్న మందులను ఆయన తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ కె. ప్రసన్న దత్తా, వైద్యాధికారులు పాల్గొన్నారు.

గిరిజన అర్చకుల శోభాయాత్ర



పాడేరు పట్టణంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న గిరిజన అర్చకులు

పాడేరు, మే 27(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో గిరిజన అర్చకులు శోభాయాత్రను నిర్వహించారు. మండలంలో సూకూరుపుట్టు గ్రామం సూర్యనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో అర్చకులకు నిర్వహించిన ఐదు రోజుల శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ పరమహంస ఆధ్వర్యంలో పాడేరులో శిక్షణ పొందిన అర్చకులతో శోభాయాత్రను నిర్వహించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర అర్చక పురోహిత్ ప్రముఖ్ శివశంకర్, విభాగ్ ప్రముఖ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యోగాసనాలతోనే ఆరోగ్యం



అధ్యాపకులతో యోగాసనాలు సాధన చేయిస్తున్న ప్రిన్సిపాల్ చలపతిరావు

అరకులోయ, మే 27 (ఆంధ్రజ్యోతి): యోగాసనాలతో శారీరక, మానసిక ఉల్లాసంతో పాటు చక్కటి ఆరోగ్యం కలుగుతుందని అరకులోయ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పట్నాసి చలపతిరావు అన్నారు. మంగళవారం యోగాంధ్ర- 2025పై కళాశాలలో చర్చించారు. ఈ సందర్భంగా అధ్యాపకులతో యోగాసనాల సాధన చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యోగా దినోత్సవం లక్ష్యం వివరించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు యోగాంధ్ర-2025 కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, కళాశాల విద్యార్థులు గ్రామాల్లో విజయవంతం చేయాలన్నారు. మే 21 తేదీ నుంచి జూన్ 21 వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లలు, యువతీ, యువకులు, పెద్దలు, వృద్ధులు అంతా పాల్గొవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రోజారాణి, లాలికుమారి, సిబ్బంది గోపాకృష్ణ, సుందరరావు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన గంగమ్మ ఉత్సవం



డోకులూరులో పూజలు అందుకున్న అమ్మవారు

పాడేరురూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డోకులూరు పంచాయతీ కేంద్రంలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న గ్రామ దేవత గంగమ్మతల్లి ముగింపు ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి సతకం పట్టు పద్ద పూజలను చేపట్టి ఘటాలు, అమ్మవారి పాదాలు, ఉత్సవ విగ్ర హాలతో ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా ప లు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గ్రా మస్థు లు అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలను చేపట్టి మొ క్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.విశ్వేశ్వరరావు నాయుడు, పాంగి స త్యనారాయణ, టి. ప్రసా ద్‌నాయుడు, సర్పంచ్ సన్నిబాబు, గామ పెద్దలున్నారు.



ఘటాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

పర్యాటక ప్రదేశాల్లో ప్రత్యేక యోగా సాధన

- కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్

పాడేరు, మే 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పర్యాటక ప్రదేశాల్లో ప్రత్యేక యోగా సాధనకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ఇందులో భాగంగా ఈ నెల 29న బొర్రాలో, జూన్ 4న అరకులోయ గిరిజన మ్యూజియంలో, అదే రోజు జిల్లా కేంద్రం పాడేరులో, జూన్ 11న డుంబ్రిగుడ మండలం చాపరాయి వద్ద, జూన్ 17న మారేడుమిల్లిలోని వన విహారీ పర్యాటక కేంద్రంలో ప్రత్యేక యోగా సాధన చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఒక్కో పర్యాటక కేంద్రంలో కనీసం ఐదు వేల మందితో యోగా నిర్వహించాలన్నారు. యోగా నోడల్ అధికారి టీడబ్ల్యూ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎంవీఎస్.లోకేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగే ఆయా యోగాలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొవాలన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే పంచకర్ల

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

పరవాడ, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో రావాడ పంచాయతీ పరిధిలోని కొత్త వెన్నెలపాలెం గ్రామానికి చెందిన చుక్క లక్ష్మీ అనారోగ్యంతో బాధ పడుతుండడంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందించారు. లక్ష్మీ మెరుగైన వైద్యం చేయించుకోవడానికి రూ.15 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండడంతో ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు స్థానిక నాయకుల ద్వారా ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ మేరకు లక్ష్మీ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి రూ.4.66 లక్షలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన చెక్కును జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ చేతుల మీదుగా మంగళవారం బాధితురాలుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు, సర్పంచులు మోటూరి సన్యాసినాయుడు, చింతకాయల సుజాత, బీజేపీ నాయకుడు గొర్లి రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుకు ఆర్థిక సహాయం



హోంగార్డు బ్రహ్మరాజుకు చెక్కును అందిస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు కె.బ్రహ్మరాజుకు సహచరులు ఆర్థిక సాయం అందజేశారు. హోంగార్డులు తమ ఒక్క రోజు వేతనం రూ.4.07 లక్షలను సమకూర్చారు. ఈ చెక్కును ఎస్పీ తుహిన్‌సిన్హా చేతుల మీదుగా మంగళవారం హోంగార్డు బ్రహ్మరాజు అందించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ ప్రతాప్ శేషయ్య, జూనియర్ అసిస్టెంట్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పశుదాణా పంపిణీ



పాడి రైతులకు దాణా అందజేస్తున్న కూటమి నాయకులు

కశింకోట, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాడి రైతులకు రాయితీపై అందిస్తున్న పశుదాణాను సద్వినియోగం చేసుకోవాలని తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి పిలుపునిచ్చారు. తాళ్లపాలెం గ్రామంలో మంగళవారం పశుదాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఎండు గడ్డి కొరత ఏర్పడడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు 50 శాతం రాయితీపై సమీకృత మిశ్రమ దాణా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. 50 కిలో బస్తా ధర రాయితీతో రూ.555కే అందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు డయానా, జేవీవో.కరుణశ్రీ, సన్యాసిరావు, కూటమి నాయకులు కర్రి వెంకట సత్యనారాయణ, కాయల మురళీధర్, నయనంశెట్టి రమణారావు, కలగా సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యోగాపై ఉద్యోగులకు శిక్షణ శిబిరం

సబ్బవరం, మే 27 (ఆంధ్రజ్యోతి): యోగాపై అధికారులు, ఉద్యోగులకు మంగళవారం శిక్షణ శిబిరం ప్రారంభించారు. యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో పిద్మజ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధునిక కాలంలో ప్రజలు మానసిక ఒత్తిడికి గురువుతున్నారని, ప్రతి రోజూ కనీసం అర్ధ గంట పాటు యోగాలసనాలు, ధ్యానం చేయాలని సూచించారు. ముఖ్యంగా అధికారులు దైనందిన జీవితంలో ఎంతో ఒత్తిడికి గురవుతున్నారని, అటువంటి వారు ధ్యానం ఆచరించాలని ఆమె చెప్పారు. వెలుగు, మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి 150 మందికి మండల స్థాయి ట్రైనర్లగా శిక్షణ ఇస్తున్నామన్నారు. వీరంతా తమ గ్రామాల్లో కనీసం 150 మందికి యోగాపై శిక్షణ ఇస్తారని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి శివరామప్రసాద్, వెలుగు ఏపీఎం సీహెచ్.శ్రీనివాసరావు, యోగా గురువు పినిపరెడ్డి సత్యనారాయణ, వెలుగు, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గెడ్డలో మట్టి తవ్విన ముగ్గురిపై కేసు

కశింకోట, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉగ్గినపాలెం రెవెన్యూ పరిధి కొత్తపల్లి బుచ్చెయ్యపేట వద్ద రంగబోలుగెడ్డలో మట్టి తవ్వకాలు జరిపిన ముగ్గురిపై కేసు నమోదు చేశామని సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. రంగబోలుగెడ్డలో మట్టి అక్రమ తవ్వకాలపై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన తహసీల్దార్ జి.సత్యనారాయణ మట్టి తవ్వకందారులను గుర్తించి కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన పోలీసులు కొత్తపల్లి బుచ్చెయ్యపేట గ్రామానికి చెందిన కె.వెంకట త్రినాథ్, ఎం.బాలాజీ, ఎం.నాగేశ్వరరావు మట్టి తవ్వుకుపోయినట్టు గుర్తించి కేసు నమోదు చేశారు.

సాగునీటి కాలువలకు మహర్దశ

రూ.50.25 లక్షలతో అభివృద్ధి పనులు

యల్లయ్య, నాగులాపల్లి కాలువలకు మోక్షం

అనకాపల్లి టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాగునీటి కాలువలకు మహర్దశ పట్టింది. ప్రధానంగా పట్టణ నడిబొడ్డున ఉన్న యల్లయ్య, నాగులాపల్లి కాలువలకు మోక్షం లభించింది. ఈ కాలువలు ఎప్పుడూ చెత్తాచెదారంతో నిండిపోయి ఉంటాయి. జీవీఎంసీ అధికారులు ఏటా చెత్తాచెదారాలు తొలగించడమే కాకుండా పూడికలు తొలగించాల్సి ఉండగా, ఈ ఏడాది ఇంకా పనులు ప్రారంభించలేదు. ఇరిగేషన్‌కు అధిక ప్రాధాన్యతనిచ్చే ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఇటీవల నిర్వహించిన సాగునీటి సంఘాల పాలకవర్గాల సమావేశంలో నియోజకవర్గంలోని



నాగులాపల్లి కాలువలో ఏపుగా పెరిగిపోయిన పిచ్చి మొక్కలు

సాగునీటి సంఘాల అభివృద్ధికి చర్యలు చేపట్టడంతో పాటు కాలువల అభివృద్ధికి నిధులు కూడా మంజూరు చేశారు.

ఇందులో భాగంగా యల్లయ్య, నాగులాపల్లి సాగునీటి కాలువల అభివృద్ధికి జీవీఎంసీ ద్వారా రూ.50.25 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో అధ్వానంగా మారిన పంట కాలువలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోనున్నారు. ప్రతి ఏటా గత ప్రభుత్వ హయాంలో ఒక్క యల్లయ్య కాలువ పూడిక తీయడానికే రూ.90 లక్షలు వరకు ఖర్చు చూపించేవారు. ఈ నిధుల నిర్వహణలో అధికారులు, అప్పటి పాలకులు చేతివాటం ప్రదర్శించారనే ప్రచారం కూడా సాగింది. అయితే కూటమి ప్రభుత్వంలో ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా ఉండేలా జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు పకడ్బందీగా అంచనాలు తయారుచేసి, ఈ రెండు కాలువల అభివృద్ధికి రూ.50.25 లక్షలు మంజూరుకు చర్యలు చేపట్టారు.

ఇప్పటికే ఈ కాలువలు చెత్తాచెదారం పేరుకుపోవడంతో పాటు మరో పక్క పిచ్చి మొక్కలు మొలిచి కాలువల స్వరూపమే లేకుండా పోయాయి. వ్యవసాయానికి సాగునీరు అందించే ఈ పంట కాలువలు మురికి కాలు



యల్లయ్య కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం

వల్లా తలపిస్తున్నాయి. ప్రజా ప్రతినిధులు, అధికారుల చొరవతో మంజూరైన ఈ నిధులతో మరో రెండు రోజుల్లో కాలువల్లో పూడికతీత పనులు, చెత్తాచెదారం తొలగింపు వంటి చర్యలు తీసుకోవడానికి జీవీఎంసీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే అధికారులు పూడికతీత పనులు చేపట్టి కాలువల్లో నీరు సజావుగా పారేలా చర్యలు తీసుకోవాలని సాగునీటి సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

యోగాతో ఆరోగ్యం మెరుగు: కలెక్టర్

పరవాడ, మే 27 (ఆంధ్రజ్యోతి): రోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యం మెరుగ్గా వుంటుందని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. యోగాంధ్ర-2025లో భాగంగా మంగళవారం ముత్యాలమ్మపాలెం బీచ్‌లో యోగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ, యోగా సాధనను దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ, రోజూ గంట సమయాన్ని యోగాకు కేటాయిస్తే వ్యాధులు దరిచేరవని అన్నారు. నెల రోజులపాటు జరిగే యోగా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం యోగాసనాలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌డీసీ అనిత, తహసీల్దార్ అంబేడ్కర్, పరవాడ, సబ్బవరం ఎంపీడీవోలు బి.రమేశ్‌నాయుడు, పి.పద్మజ, మండల ప్రత్యేకాధికారి సరోజిని, సర్పంచ్ చింతకాయల సుజాత, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ముత్యాలమ్మపాలెం బీచ్‌లో యోగా చేస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

సురక్షితంగా మగ్గిన పండ్లనే విక్రయించండి

▸▸ **ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ సత్యనారాయణరావు**

అనకాపల్లి కలెక్టరేట్, మే 27 (ఆంధ్రజ్యోతి): సురక్షిత విధానంలో మగ్గబెట్టిన మామిడిపండ్లను మాత్రమే వ్యాపారులు విక్రయించాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్, డీఆర్‌వో వై.సత్యనారాయణరావు స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలోని తన చాంబర్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. మగ్గిన పండ్లనే వ్యాపారులు విక్రయించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా ఉద్యానవన శాఖ అధికారులు పండ్లను మగ్గబెట్టే సురక్షిత విధానాలపై రైతులు, వ్యాపారులకు తెలియజేయాలన్నారు. ముఖ్యంగా మామిడిపండ్ల సీజనులో మానవులకు హాని కలిగించే కాల్షియమ్ కార్బైడ్ ఉపయోగించి పండ్లు మగ్గబెట్టే విధానాన్ని పూర్తిగా అరికట్టాలని ఆయన స్పష్టం చేశారు. ఆహార భద్రతా శాఖ సిబ్బంది ఇప్పటి వరకు 26 శాంపిళ్లు సేకరించారని, ఆహార ప్రయోగశాల నివేదికలు అందిన తర్వాత కార్బైడ్ వాడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని తెలియజేశారు. జిల్లా పంచాయతీశాఖ, మున్సిపల్ సిబ్బంది చిన్న వ్యాపారులకు కార్బైడ్ వినియోగం వలన కలిగే అనర్థాలను తెలియజేయాలని, రవాణాశాఖ



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి జేసీ సత్యనారాయణరావు

సిబ్బంది మామిడి పండ్ల రవాణా వాహనాలను తనిఖీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ, మార్కెటింగ్, మున్సిపాలిటీ, మెడికల్, హెల్త్, పంచాయతీ, హార్టికల్చర్, ట్రాన్స్‌పోర్టు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

2.1 ఎకరాలు ఆక్రమణలో ఉన్నట్టు గుర్తింపు.. 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

సబ్బవరం, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాటజంగాలపాలెం సర్వే నంబరు 195 ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. 'ప్రభుత్వ భూమి కబ్జా' అనే శీర్షికన ఈ నెల 25న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన ప్రత్యేక కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ఈ మేరకు తహసీల్దార్ బి.చిన్నికృష్ణ దగ్గరుండి మంగళవారం సర్వే చేయించారు. ప్రభుత్వ భూమి సరిహద్దులు గుర్తించారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి 1.4 ఎకరాలు, కోడూరు-నారపాడు రోడ్డులో 70 సెంట్లు, రోడ్డుకు కుడి వైపున ఖాళీగా 3.40 ఎకరాలు ఉన్నట్టు సర్వేలో తేల్చారు. 'ఆంధ్రజ్యోతి' కథనంపై జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆరా తీశారని తహసీల్దార్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ భూమి చుట్టూ ట్రెంచ్ ఏర్పాటు చేశామన్నారు. ఏదైనా ప్రభుత్వ శాఖకు అప్పగించే ఆలోచన కలెక్టర్ చేస్తున్నారని తహసీల్దార్ తెలిపారు. ప్రభుత్వ భూముల ఆక్రమణకు పాల్పడ్డవారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని ఈ



బాటజంగాలపాలెం ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు పెడుతున్న అధికారులు

సందర్భంగా తహసీల్దార్ హెచ్చరించారు.

హేతుబద్ధీకరణలో సవరణలు చేయండి

▸▸ **తహసీల్దార్‌కు వీఆర్వోల వినతి**

కశింకోట, మే 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల్లో ఇప్పటికే రెవెన్యూ సేవలు ఆలస్యమవుతున్న తరుణంలో ప్రభుత్వం హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్) జీవో నంబరు-4ను తీసుకురావడం సరికాదని వీఆర్వోల సంఘం మండల ప్రతినిధులు వాపోయారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ జి.సత్యనారాయణను వారంతా కలిసి సమస్యను వివరించారు. జీవో నంబరు-4లో గ్రామ రెవెన్యూ అధికారులను సచివాలయాలకు కేటాయించడం రెవెన్యూ సేవలకు మరింత భారం పడేలా ఉందన్నారు. జీవో ప్రాతిపదికన చూస్తే ప్రతీ రెండు సచివాలయాల పరిధిలో మూడు నుంచి ఆరు వరకు రెవెన్యూ గ్రామాలు చూడాల్సి రావడంతో సేవల్లో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వం తక్షణమే ఈ జీవోను పునఃపరిశీలన చేసి సవరించాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఆర్వీనారాయణరావు, మండల



తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అధ్యక్షుడు గొర్లి ప్రసాద్, కార్యదర్శి జి.పృథ్వీ, సభ్యులు ఉదయ్‌కుమార్, శివాజీ, రాయవరపు శ్రీనివాసరావు, నాయుడుబాబు, చందు పాల్గొన్నారు.

వర్షంతో చల్లబడ్డ వాతావరణం

అనకాపల్లి టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం మధ్యాహ్నం వర్షం కురిసింది. అప్పటి వరకు 35.8 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతతో అల్లాడిపోయిన ప్రజలకు ఈ వర్షంతో వాతావరణం చల్లబడటంతో ఉపశమనం లభించింది. 29.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. వర్షం కారణంగా పలు చోట్ల రహదారులపై నీరు నిలిచిపోవడంతో పాదచారులు, వాహన చోదకులు రాకపోకలు సాగించేందుకు తీవ్రమైన ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోనూ, విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద వర్షపునీరు నిలిచిపోయింది. బ్రిడ్జి కింద నీరు నిలిచిపోవడంతో అనకాపల్లి-చోడవరం మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఏదేమైనా ఈ వర్షం మాత్రం ప్రజలకు ఉపశమనం కలిగించింది.

అంతర్జాతీయ యోగా ప్రదర్శనకు గురుకుల విద్యార్థినుల ఎంపిక



కౌశిక... వైష్ణవి

పరవాడ, మే 27 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో వచ్చే నెల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో నిర్వహించనున్న యోగా ప్రదర్శనలో యోగా చేయడానికి మండలంలోని తానాం గురుకుల పాఠశాలకు చెందిన శీర కౌశిక, బోను వైష్ణవి ఎంపికైనట్టు పాఠశాల యోగా కోచ్ ఆంజనేయులు తెలిపారు. ఎనిమిదో తరగతి చదువుతున్న ఈ ఇద్దరు బాలికలు గతంలో వివిధ స్థాయిల్లో నిర్వహించిన యోగా పోటీల్లో బంగారు పతకాలు సాధించారన్నారు. వీరి ప్రతిభను గుర్తించి వచ్చే నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మోదీ సమక్షంలో జరగనున్న ప్రదర్శనకు అధికారులు ఎంపిక చేసినట్టు ఆయన తెలిపారు.

ఎంఎస్‌ఎంఈ సర్వే పూర్తయితే ఉద్యమ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

అనకాపల్లి కలెక్టరేట్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్‌ఎంఈ సర్వే పూర్తయిన వ్యాపార, పరిశ్రమలు, సేవా రంగ సంస్థల యాజమానులు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వి.ఆదిశేషు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు, మార్కెటింగ్, టెండర్లల్లో ఉద్యమ్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. మరిన్ని వివరాల కోసం జిల్లా పరిశ్రమల శాఖ అధికారి కార్యాలయానికి సంప్రదించాలని ఆయన సూచించారు.

అనకాపల్లిలో సత్యసాయి ప్రేమ రథం

అనకాపల్లి టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా ప్రేమ ప్రవాహిని ప్రేమరథం మంగళవారం రాత్రి అనకాపల్లికి చేరింది. పుట్టపర్తి నుంచి వచ్చిన ఈ ప్రేమ రథం అనకాపల్లి పురవీధుల్లో ఊరేగించగా భక్తులు దర్శించుకున్నారు. గుండాలజంక్షన్‌లో ప్రారంభమైన ఈ రథం లక్ష్మీదేవిపేట గేటు మీదుగా రామచంద్ర థియేటర్, నెహ్రూచౌక్ జంక్షన్, మెయిన్ రోడ్డు మీదుగా గవరపాలెం సత్యసాయి మందిరానికి చేరుకుంది. అక్కడ సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో సాయి భక్తులు గుంపిన రమేశ్ గుప్తా, మోదినాయుడు, బెనర్జీ, కామరాజు, గాంధీనగరం కన్వీనర్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

యోగాపై ఐదు రోజుల శిక్షణ

కశింకోట, మే 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూకాంబిక ఫంక్షన్ హాలులో మంగళవారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఐదు రోజుల పాటు శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఈ శిక్షణలో 154 మంది పాల్గొన్నారు. యోగా వల్ల కలిగే ఉపయోగాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మండల ప్రత్యేకాధికారిణి వి.లక్ష్మీ సుభాషిణి, ఎంపీడీవో వి.వి.రవికుమార్ పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకాలపై అవగాహన

కశింకోట, మే 27 (ఆంధ్రజ్యోతి): భగవద్గీతలో శ్లోకాలపై తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. గ్రంథాలయాలకు విద్యార్థులు క్రమం తప్పకుండా వెళ్తే విజ్ఞానం పెరుగుతుందని ఈ సందర్భంగా నర్సింగబిల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సురేశ్‌కుమార్ చెప్పారు. అలాగే రామాయణం, భగవద్గీతలో ముఖ్య ఘట్టాలను వివరించారు. అనంతరం నీతి కథలు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జగన్ పాల్గొన్నారు.

నేడు ఎన్టీఆర్ జయంతి వేడుకలు

సబ్బవరం, మే 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలిలో బుధవారం దివంగత ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారకరామారావు జయంతి వేడుకలు జరుగుతాయని పార్టీ మండల అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పాల, నీటి సంఘం ప్రతినిధులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో అనర్థాలు

కాలుష్యంతో పర్యావరణానికి పెనుముప్పు

పారిశుధ్య సమస్యతో ప్రజల అవస్థలు

మృత్యువాత పడుతున్న మూగ జీవాలు

కాగితాలకే పరిమితమైన ప్లాస్టిక్ నిషేధం

సబ్బవరం, మే 23 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి పెనుముప్పు తెస్తున్న ప్లాస్టిక్ వినియోగానికి అడ్డూ అదుపు లేకపోతోంది. పట్టణాలు, నగరాల్లోనే కనిపించే పాలిథిన్ సంచులను మారుమూల పల్లెల్లోనూ వినయోగిస్తున్నారు. పెరిగిపోయింది. మండలంలోని 24 పంచాయతీల్లోనూ ఈ పరిస్థితి నెలకొంది. మండల కేంద్రంలో నిత్యం లెక్కలేని విధంగా ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోయింది. రోడ్ల పక్కన, దుకాణాల వద్ద వ్యర్థాలు కుప్పలు దర్శనమిస్తాయి.

అమలుకాని ప్లాస్టిక్ నిషేధం

పర్యావరణానికి ముప్పు తెచ్చే 40 మైక్రాన్ల కంటే తక్కువ దలసరి ఉన్న ప్లాస్టిక్, పాలిథిన్ సంచుల వినియోగాన్ని కేంద్ర ప్రభుత్వం 2011లో నిషేధించింది. నిషేధం అమల్లోకి వచ్చి 14 ఏళ్లు గడుస్తున్నా కనీస స్థాయిలో ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగం తగ్గకపోగా.. నానాటికీ పెరిగిపోతూనే ఉంది.



సబ్బవరం-వంగలి రహదారి పక్కనే పడేసిన వ్యర్థాలు

అయినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

నిత్యావసర సరకులు చేరవేత దగ్గర నుంచి ఆహారం ప్యాకింగ్ వరకూ ప్లాస్టిక్ సంచులను వినియోగిస్తున్నారు. విందు, వినోదాలు, ఇతర కార్యక్రమాల్లో ప్లాస్టిక్ వాడకం అలవాటుగా మారిపోయింది. ప్లాస్టిక్ సంచులను డంపింగ్ యార్డుకు తరలించినా, కుప్పలుగా పేరుకుపోతున్నాయే తప్ప భూమిలో కలిసే పరిస్థితి లేదు. డ్రైనేజీలు, పంట కాలువలు ఈ ప్లాస్టిక్ వ్యర్థాలతో పూడుకుపోతున్నాయి. పశువులు, మూగ జీవాలు వీటిని తినేస్తుండడంతో చాలా ప్రాంతాల్లో మృత్యువాత పడుతున్నాయి. ఇటీవల పంట పొలాల్లో కూడా ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమివ్వడం ఆందోళనకు గురి చేస్తున్నది.



సబ్బవరంలో రోడ్డు పక్కన పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్లాస్టిక్ వ్యర్థాలతో మనిషి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నా, ఎవరూ పట్టించుకోకపోవడం విచారకరం. స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్ర పేరిట పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నా పాలిథిన్ సంచుల వినియోగం తగ్గడం లేదు. ప్రభుత్వాలు పాలిథిన్ వాడకంపై కఠిన నిర్ణయాలు తీసుకొని, నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపడితేనే రానున్న రోజుల్లో మానవ మనుగడ సాధ్యమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్లాస్టిక్ సంచులు/కవర్లు నిషేధంపై ప్రభుత్వం, అధికారులు, ప్రజా ప్రతినిధులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



మహానాడు సంబరం





కడప గడపలో టీడీపీ మహానాడు కార్యక్రమం తొలిరోజు సంబరంగా సాగింది. మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకతో పాటు విదేశాల నుంచీ వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో కడప గడప పసుపుమయంగా మారింది. ఉదయం ప్రతినిధుల సభకు సభ్యత్వ నమోదుతో మొదలైన కార్యక్రమం సాయంత్రం చంద్రబాబు ప్రసంగంతో ముగిసింది. వందలాది కార్యకర్తలు రక్తదానం చేశారు. లోకేశ్‌తో సెల్ఫీలు, షేక్‌హ్యాండ్ కోసం కార్యకర్తలు, అభిమానులు ఎగబడ్డారు. వేదికపై చంద్రబాబు, లోకేశ్ మాట్లాడుతున్నంతసేపూ జనం కేరింతలు కొట్టారు. 'ఈసారి కడప కూడా మాదే', యువగళం సక్సెస్ తదితర ప్లకార్డులను, ఫ్లెక్సీలను కార్యకర్తలు ప్రదర్శించారు. వేలాదిగా తరలివచ్చిన జనానికి మంచి విందు భోజనం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహానాడు సంబరంగా సాగింది. రెండోరోజు మహానాడు కోసం అందరూ ఉత్సాహంగా ఎదురుచూస్తూ వారికి కేటాయించిన విడిది కేంద్రాల్లో బస చేశారు.



చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

ఇసుక, గ్రావెల్ దందాను 48 గంటల్లో ఆపాల్సిందే

... 3వ పేజీ తరువాయి

పట్టించుకోకపోవడం శోచనీయమని అన్నారు. విశాఖ, అనకాపల్లి ప్రాంతాలకు చెందిన వ్యక్తులు రాజకీయ అండదండలతో చోడవరం ప్రాంతంలో సహజ వనరులను దోచుకుంటున్నారని, వీరికి స్థానిక అధికారులు అండదండలు అందిస్తున్నారని ధ్వజమెత్తారు. మండలంలో ఇసుక, గ్రావెల్ దోపిడీ నిరోధానికి పంచాయతీల వారీగా సమన్వయ కమిటీలు వేయాలని, మండలస్థాయిలో టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో అక్రమ దందా ఆగకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని ఆయన స్పష్టం చేశారు. జనసేన నాయకులు అల్లం రామప్పారావు, గూనూరు మూలినాయుడు, నరవ సరోజిని, కర్రి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతి కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం

- కూడు, గూడు, గుడ్డ కల్పించాలన్నదే పార్టీ నినాదం
- స్పీకర్ అయ్యన్నపాత్రుడు



టీడీపీ జెండాతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, మే 27(ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతి కోసం పుట్టిన పార్టీ టీడీపీ అని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. బడుగు, బలహీనవర్గాలకు కూడు, గుడ్డ, నీడ కల్పించాలన్నదే పార్టీ నినాదమన్నారు. మంగళవారం నర్సీపట్నం క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బుధవారం ఎన్టీరామారావు జయంతిని ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఎన్టీరామారావు రాష్ట్రాభివృద్ధి కోసం 1982లో తెలుగుదేశం పార్టీ స్థాపించారని తెలిపారు. పేదలకు కిలో రూ.2 బియ్యం పథకం, తండ్రి ఆస్తిలో కూతురికి ఆస్తి హక్కు కల్పించిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. ఎన్టీఆర్ లాంటి మహానటుడు దేశంలోని ఏ సినిమా పరిశ్రమలో లేరని అన్నారు.

రేషన్ పంపిణీ కమీషన్ పెంచాలి



అనకాపల్లిలో సమావేశమైన రేషన్ డీలర్లు

- ప్రభుత్వానికి డీలర్ల విజ్ఞప్తి

అనకాపల్లి టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీ చేసే తమ కమీషన్ పెంచాలని రేషన్ డీలర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఇక్కడ జరిగిన జిల్లా రేషన్ డీలర్ల సమావేశంలో పలువురు మాట్లాడారు. ఎండీయూలను ఆపేసి, పాత విధానంలోనే డిపోల ద్వారా కార్డుదారులకు సరకులు పంపిణీ చేసే విధానాన్ని అమలు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తోపాటు మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్డుదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, ప్రభుత్వం నిర్దేశించిన వేళల్లో సరకులు అందజేస్తామని చెప్పారు.

ఈ సమావేశంలో రేషన్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొప్పాక శేషు, కార్యదర్శి కె.రామ్మోహనరావు, వర్కింగ్ వైస్ ప్రెసిడెంట్ పి.నాయుడు, కోశాధికారిమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత దిశగా..

... 3వ పేజీ తరువాయి

పాత నేరస్థులను స్టేషన్‌కు పిలిపించి ఎక్సైజ్ అధికారులు కౌన్సెలింగ్ చేస్తున్నారు. 771 మంది పాత నేరస్థులను లక్ష రూపాయల పూచీకత్తుతో తహసీల్దార్ల వద్ద బైండోవర్ చేశారు. దీంతో ఏ కేటగిరిలో 17 గ్రామాలు, మిగిలిన రెండు కేటగిరీల్లో అన్ని గ్రామాలు (147) సారా రహితంగా గుర్తించారు. ఏ కేటగిరీలో వున్న పాయకరావుపేట, వి.మాడుగుల మండలం లోవ గవరవరం, కొండలపాలెం, రావికమతం మండలం మేడివాడ గ్రామాలను సారా రహితంగా ప్రకటించాల్సి ఉంది. సారా రహితంగా గుర్తించిన గ్రామాల్లో గ్రామ కమిటీల ఆమోదం తీసుకున్నారు. మండల కమిటీల తీర్మానాలు కూడా దాదాపు పూర్తి చేశారు.

16 నెలలో 4,185 లీటర్ల సారా స్వాధీనం

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది జిల్లాలో నాటుసారా బట్టీలపై విస్తృతంగా దాడులు నిర్వహించారు. గత ఏడాది జనవరి నుంచి డిసెంబరు వరకు 1,083 కేసులు నమోదు చేసి 1,974.5 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. 5,84,120 లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేశారు. 236 మందిని అరెస్టు చేసి ఎనిమిది వాహనాలను సీజ్ చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు 363 కేసులు నమోదు చేసి 275 మందిని అరెస్టు చేశారు. 2,211 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొన్నారు. 96,650 లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేశారు. 15 వాహనాలు, 7,724 కిలోల నల్ల బెల్లం సీజ్ చేశారు. మే నెలలో నాలుగు కేసులు మాత్రమే నమోదు అయ్యాయి. సారా రహిత గ్రామాలుగా ప్రకటించిన తర్వాత ఆయా గ్రామాల్లో కేసులు నమోదు కాలేదు.

నాటు సారా తయారీ, రవాణా, అమ్మకాలను నిరోధించడానికి ప్రభుత్వం ప్రత్యేంగా టోల్ ఫ్రీ నంబర్ (14405) ప్రకటించిందని, గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడైనా సారా విక్రయించినా, తయారు చేసినా, రవాణా చేసినా సమాచారం ఇవ్వాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాక అసిస్టెంట్ కమిషనర్ సుర్జిత్‌సింగ్ కోరారు.

రేషన్ కార్డులకు దరఖాస్తుల వెల్లువ

... 3వ పేజీ తరువాయి

428 మంది దరఖాస్తు చేసుకున్నారు.

వాట్సాప్ ద్వారా దరఖాస్తు

సచివాలయాల్లో సర్వర్లు మొరాయిస్తుండడంతో ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్‌లో భాగంగా శనివారం నుంచి 'మన మిత్ర'లో పౌరసరఫరాల సేవలను అందుబాటులోకి తెచ్చింది. వాట్సాప్‌లోకి వెళ్లి 95523 00009 నంబర్‌ను టైప్ చేస్తే 'మన మిత్ర' అని వస్తుంది. ఇక్కడ ఇంగ్లిష్‌లో 'హాయ్' అని టైప్ చేస్తే ప్రభుత్వానికి సంబంధించి పలు శాఖల సేవలు కనిపిస్తాయి. ఇందులో పౌరసరఫరాల శాఖ సేవలు కూడా వుంటాయి. రేషన్ కార్డులకు సంబంధించిన దరఖాస్తులను 'మన మిత్ర' ద్వారా చేసుకోవచ్చు. తరువాత ఈకేవైసీ కోసం సమీపంలోని సచివాలయానికి వెళ్లాల్సి వుంటుంది.